ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



నాడు



ఎమ్మిగనూరులోని గోనెగండ్ల సర్కిల్‌లో గుంతలమయంగా మారిన ఎమ్మిగనూరు-కర్నూలు ప్రధాన రహదారి

నేడు



టీడీపీ కూటమి ప్రభుత్వం వచ్చాక మరమ్మతులు చేపట్టడంతో అందంగా కనిపిస్తున్న రోడ్డు

- వైసీపీ హయాంలో రోడ్లు అస్తవ్యస్తం
- ఎన్డీయే కూటమి ప్రభుత్వంలో మోక్షం
- ఉమ్మడి జిల్లాలో మరమ్మతులకు రూ.234.08 కోట్లు
- 95 శాతం పూర్తయిన పనులు

పల్లె రోడ్లు భళా...!

మారిన గ్రామీణ రహదారులు

ఆరు నెలల క్రితం వరకు ఉమ్మడి జిల్లాలో అధ్వాన రహదారులు.. అడుగడుగునా గుంతలమయం. రోడ్డెక్కాలంటే భయపడే పరిస్థితి. వాహనదారులకు రాకపోకలు నరకప్రాయంగా మారాయి. గుంతల రోడ్లలో ప్రయాణం చేయలేక జనం పడిన అవస్థలు ఎన్నో. పల్లెసీమల రోడ్లే కాదు.. ప్రధాన రహదారులు సైతం దారుణంగా ఉండేవి. నిధుల లేమితో గంపెడు మట్టివేసి గుంతలు పూడ్చలేని దైన్యపరిస్థితి. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రోడ్ల దుస్థితి ఇది. సీఎం చంద్రబాబు నాయకత్వంలో ఎన్డీయే కూటమి ప్రభుత్వం కొలువుదీరాక రోడ్ల మరమ్మతులపై ప్రత్యేక దృష్టిపై సారించింది. తొలి ప్రాధాన్యతగా గుంతల్లేని రహదారుల కోసం చర్యలు చేపట్టారు. కర్నూలు, నంద్యాల జిల్లాల్లో రోడ్లు, భవనాల శాఖ ఆధ్వర్యంలో రూ.77.04 కోట్లతో మరమ్మతులు, వంతెనల నిర్మాణాలు చేపట్టారు. అలాగే పంచాయతీరాజ్ శాఖ పర్యవేక్షణలో రూ.156.99 కోట్లతో గ్రామీణ రోడ్ల మరమ్మతులు, కొత్త దారుల పనులు చేపట్టారు. దాదాపుగా 95 శాతం పనులు పూర్తయ్యాయని ఇంజనీర్లు తెలిపారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో నాడు-నేడు రహదారులపై ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం.

ఉమ్మడి జిల్లాలో రోడ్లు మరమ్మతుల వివరాలు

రోడ్ల వివరాలు	కర్నూలు	నంద్యాల	మొత్తం
ఆర్ అండ్ బీ రోడ్లు (కి.మీలు)	429	359.74	788.74
వంతెనలు	10	13	23
నిధులు (రూ.కోట్లలో)	31.34	45.75	77.09
గ్రామీణ రోడ్డు (పనుల సంఖ్య)	837	1,026	1,863
నిధులు (రూ.కోట్లలో)	71.04	85.95	156.99

మిగతా 6వ పేజీలో

కర్నూలు, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): రోడ్లు, భవనాల శాఖ పర్యవేక్షణలో కర్నూలు జిల్లాలో 3,399.75 కిలోమీటర్లు, నంద్యాల జిల్లాలో 1,512.605 కిలోమీటర్లు వివిధ రహదారులు ఉన్నాయి. వైసీపీ ప్రభుత్వ హయాంలో రహదారుల మరమ్మతులుఒ ఏమాత్రం పట్టించుకోలేదు. ఐదేళ్ల కనీసం మరమ్మతులు చేయకుండా గాలికొదిలేశారు. కూటమి ప్రభుత్వం అధ్వాన రోడ్ల మరమ్మతులపై ప్రత్యేక దృష్టిని సారించింది. సంక్రాంతి నాటికి గుంతలు లేని రోడ్లు చూస్తారంటూ ప్రభుత్వం ఏర్పాటైన తొలినాళ్లలో సీఎం చంద్రబాబు స్పష్టమైన హామీనిచ్చారు. ఆ దిశగా అడుగులు వేసి ఇచ్చిన హామీని నెరవేర్చారు. నిధులు ఇచ్చి గుంతలు పూడ్చే పనులు చేపట్టి ఇంజనీర్లు, కాంట్రాక్టర్లను పరుగులు పెట్టించారు. గుంతలు పూడ్చడంతో ప్రయాణం సాఫీగా సాగుతోంది. ప్రజలు, వాహనదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. కర్నూలు జిల్లాలో రూ.31.34 కోట్లతో 429 కిలోమీటర్లు, నంద్యాల జిల్లాలో రూ.45.75 కోట్లతో 359.74 కిలోమీటర్ల మరమ్మతు పనులు రోడ్లు భవనాల శాఖ ఇంజనీర్ల పర్యవేక్షణలో చేపట్టారు. ఇందులోనే 30 కోట్లుతో 23 బ్రిడ్జిలు (వంతెనలు) నిర్మాణాలు ఉన్నాయి. రహదారులు మరమ్మతులు 97 శాతం పూర్తి కాగా.. వంతెన పనులు వివిధ దశల్లో ఉన్నాయని ఇంజనీర్లు తెలిపారు.

గ్రామీణ రోడ్లకు మోక్షం

ఉమ్మడి జిల్లాలో ప్రధాన రహదారులే కాకుండా టీడీపీ కూటమి ప్రభుత్వం గ్రామీణ దారుల అభివృద్ధికి శ్రీకారం చుట్టింది. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంఎన్ఆర్ఈజీఎస్) కింద ఉమ్మడి జిల్లాలో రూ.156.99 కోట్లతో 1,863 పనులు చేపట్టారు. పంచాయతీరాజ్ (పీఆర్) పర్యవేక్షణలో గ్రామాల మధ్య అనుసంధానం (కనెక్టివిటీ) రోడ్లు, అంతర్గతదారులు నిర్మాణాలకు ప్రాధాన్యత ఇచ్చారు. కర్నూలు జిల్లాలో రూ.71.04 కోట్లతో 837 పనులు, నంద్యాల జిల్లాలో రూ.85.95 కోట్లతో 1,026 పనులు చేట్టారు. 95 శాతం పనులు పూర్తి చేసి రాష్ట్రంలో మొదటి రెండు స్థానాలు కర్నూలు, నంద్యాల జిల్లాలు నిలిచాయి. అటు ప్రధాన రోడ్లు, ఇటు పల్లె దారులు బాగుపడడంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

అభివృద్ధిని జీర్ణించుకోలేని జగన్

- జిల్లా అభివృద్ధి కోసం సీఎంను కలుస్తాం
- టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి

కర్నూలు అర్బన్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి జీర్ణించుకోలేకపోతున్నారని టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి ధ్వజమెత్తారు. సోమవారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ రైతులు, విద్యార్థులను రెచ్చగొట్టి ఆందోళనలు చేసేందుకు కుట్రలు చేస్తున్నారని, ప్రజలు ఎవ్వరూ ఆయన మాటలు పట్టించుకునేందుకు సిద్ధంగా లేరని అన్నారు. రాష్ట్రాన్ని ఆర్థికంగా దివాలా తీయించి, అన్ని వనరులను సర్వనాశనం చేసిన తీరు ప్రజలకు ఇంకా గుర్తుందని అన్నారు. వ్యవస్థలన్నిటినీ గాడిలో పెట్టేందుకు చంద్రబాబు నాయుడు కేంద్ర ప్రభుత్వ సహకారంతో కృషి చేస్తున్నారని అన్నారు. జిల్లాను అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు ఎన్నో కార్యక్రమాలను చేపట్టారని, పత్తికొండ, ఆలూరు, మంత్రాలయం, ఎమ్మిగనూరు వంటి ప్రాంతాల అభివృద్ధికి సోలార్ విద్యుత్, పత్తికొండలో జ్యూస్ ఫ్యాక్టరీ, ఆర్‌డీఎస్ రైట్ కెనాల్, వేదవతి వంటి వాటి కోసం ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని గుర్తు చేశారు. గుండ్రేవుల ప్రాజెక్టు కోసం సీఎం చంద్రబాబుకు విన్నవించుకునేందుకు ఉమ్మడి జిల్లా నాయకులు ముందుకు రావాలని, ఈ ప్రాజెక్టు నిర్మాణం జరిగితే కర్నూలుతో పాటు ఇతర ప్రాంతాలకు సాగు, తాగునీటి సమస్య శాశ్వతంగా పరిష్కారం అవుతుందని అన్నారు. జిల్లాలో పరిశ్రమల స్థాపన కోసం మంత్రి టీజీ భరత్ ఎంతో కృషి చేస్తున్నారని, జిల్లాకు హైకోర్టు బెంచ్ ఏర్పాటు ప్రక్రియ వేగవంతం కావడానికి కృషి చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి బత్తిన వెంకట రాముడు, ఆదోని నాయకులు ఉమాపతి నాయుడు, బతే క్రిష్ణుడు, జె. పుల్లయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తిక్కారెడ్డి

విచారణ జరిపి న్యాయం చేస్తాం

ఎస్పీ విక్రాంత్ పాటిల్

కర్నూలు క్రైం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : విచారణ జరిపి న్యాయం చేస్తామని ఎస్పీ విక్రాంత్ పాటిల్ అన్నారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో సోమవారం ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. మొత్తం 113 ఫిర్యాదులు వచ్చాయి.

- కర్నూలు కోర్టులో ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పి అనంతపురానికి చెందిన సాదిక్ వలి రూ.4 లక్షలు తీసుకుని మోసం చేశాడని కర్నూలు విద్యానగర్‌కు చెందిన సందీప్ చంద్రపాల్ ఫిర్యాదు చేశారు.
- నా కుమారుడు సురేష్‌ను కెనడాలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగానికి పంపిస్తామని ఢిల్లీకి చెందిన ఆశా ఠాకూర్ ఫీజుల పేరుతో రూ.1.6 లక్షలు కట్టించుకుని మోసం చేశారని వెంకట రమణ కాలనీకి చెందిన సుబ్రహ్మణ్యం ఫిర్యాదు చేశారు.
- కుమారుడు ఇంట్లో అన్నం పెట్టకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నాడని కర్నూలు అశోక్‌నగర్‌కు చెందిన లక్ష్మీదేవి ఫిర్యాదు చేశారు.



ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

- నా భర్త మధు ఆస్తి గొడవలు పడి నా 3 సంవత్సరాల కుమారుడుని తీసుకెళ్లిపోయాడని నా బాబును ఇప్పించాలని కర్నూలు మండలం, ఉల్చాల గ్రామానికి చెందిన ప్రమీల ఫిర్యాదు చేశారు.
- మా బావగారైన వెంకటస్వామి, నడిపి వెంకటస్వామి కలిసి మా పొలాన్ని ఆక్రమించుకున్నారని వెల్దుర్తి మండలం అమకతాడు గ్రామానికి చెందిన మల్లమ్మ ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో అడిషినల్ ఎస్పీ అడ్మిన్ హుశేన్‌పీరా, సీఐ శ్రీనివాస నాయక్ పాల్గొన్నారు.

నులి పురుగులను తరిమేద్దాం

కలెక్టర్ రంజిత్ బాషా



విద్యార్థినికి మాత్రలు మింగిస్తున్న కలెక్టర్

కర్నూలు హస్పిటల్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): చిన్నారుల అనారోగ్యానికి కారణమయ్యే నులిపురుగులను ఆల్బెండజోల్ మాత్రలతో తరిమేద్దామని కలెక్టర్ పి.రంజిత్ బాషా అన్నారు. సోమవారం మధ్యాహ్నం జాతీయ నులిపురుగుల నివారణ దినం పురస్కరించుకుని నగరంలోని ఇందిరాగాంధీ స్మారక మున్సిపల్ హైస్కూల్‌లో కలెక్టర్, డీఎంహెచ్‌వో డా.పీ.శాంతికళతో కలిసి చిన్నారులకు ఆల్బెండజోల్ మాత్రలను వేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 6.42 లక్షల మంది పిల్లలకు జాతీయ నులిపురుగుల నిర్మూలన కింద ఆల్బెండజోల్ 400 మిల్లీ గ్రాములు మాత్రలను మింగిస్తున్నామన్నారు. ఎవరైనా ఈ నెల 10వ తేదీ ఆల్బెండజోల్ మాత్రలను మింగని పిల్లలకు ఈ నెల 17న మాప్ ఆప్ రౌండ్ ఆల్బెండజోల్ మాత్రలను ఇస్తామన్నారు. చిన్నపిల్లలు, బాలబాలికల్లో పౌష్టికాహార లోపం, రక్తహీనతకు కారణమయ్యే నులి పురుగులను నివారించేందుకు ప్రభుత్వం ఉచితంగా మాత్రలను పంపిణీ చేస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి శ్యామ్యూల్ పాల్, ఆర్‌బీఎస్‌కే జిల్లా కోఆర్డినేటర్ డా.శైలేష్ కుమార్, బుధవారపేట అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యాధికారిణి డా.మాధవి, పాఠశాల హెచ్‌ఎం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

అర్జీలను వేగవంతంగా పరిష్కరించాలి

కర్నూలు కలెక్టరేట్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): సీఎం కార్యాలయం నుంచి వచ్చిన అర్జీలను వేగవంతంగా పరిష్కరించాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా కలెక్టర్ ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం కార్యాలయం నుంచి వచ్చిన అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. పత్తికొండ ఆర్డీవోకు సంబంధించిన 17, సబ్ కలెక్టర్ ఆదోనికి 16, కర్నూలు ఆర్డీవో 12, డీఎస్‌వోకు 2, జిల్లా పురావస్తు అధికారి కోఆపరేటివ్ అధికారి, జిల్లా రిజిస్ట్రార్, జిల్లా పౌర సరఫరాల అధికారి, హౌసింగ్ పీడీ వక్ఫ్‌బోర్డుకు సంబంధించి ఒక్కొక్క దరఖాస్తు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. పీజీఆర్‌ఎస్‌కు సంబంధించి లాగిన్ ద్వారా దరఖాస్తుల పరిశీలనలో జాప్యం చేసిన అధికారులపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. డీఎస్‌డీవో, సి.బెళగల్ తహసీల్దార్, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్, ఆలూరు, ఆస్పరి ఎంపీడీవోల లాగిన్‌లలో వచ్చిన దరఖాస్తులను ఇంకా ఓపెన్ చేసి కూడా చూడలేదన్నారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ బి.నవ్య, అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, డీఆర్వో సి.వెంకటనారాయణమ్మ, స్పెషల్ డిప్యూటీ డైరెక్టర్ బీకే వెంకటేశ్వర్లు, కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

గీత కులస్థులకు 10 దుకాణాలు

- ఏడుగురిలో ఒక మహిళకు దుకాణం
- 109కి చేరిన మద్యం దుకాణాలు
- సీమలో కర్నూల్లో పోటా పోటీ..
- రూ. 51.66 లక్షల ఆదాయం
- లాటరీ ద్వారా ఎంపిక చేసిన జేసీ

కర్నూలు అర్బన్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): గీత ఉప కులాలకు 10 మద్యం దుకాణాలను ఖరారు చేశారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎం. సుధీర్‌బాబు, డిప్యూటీ కమీషనర్ పోతుల శ్రీదేవి ఆధ్వర్యంలో జాయింట్ కలెక్టర్ నవ్య లాటరీ పద్ధతిలో ఎంపికి చేశారు. జిల్లాలో 99 మద్యం దుకాణాలుండగా ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారం గీత కులాలకు పదిశాతం లెక్కన పది దుకాణాలను కేటాయించడంతో ఆ సంఖ్య 109కి చేరింది. రాయలసీమ జిల్లాలోనే లాటరీ పద్ధతిలో తమ అదృష్టాన్ని పరీక్షించుకోడానికి కర్నూల్లో పోటీ పడి దరఖాస్తులు వేశారు. ఏడుగురు మహిళలు . దరఖాస్తు చేసుకోగా కోసిగి నుంచి ఈడిగ సుజాత అనే మహిళకు లాటరీలో దుకాణం దక్కింది. లాటరీ ప్రక్రియలో అవకాశం దక్కక పోవడంతో నిరాశతో పలువురు వెనుతిరిగారు. ఫలితంగా దరఖాస్తుల ద్వారా ప్రభుత్వానికి రూ. 2.66 కోట్ల ఆదాయం సమకూరింది. ఈ ప్రక్రియకు జిల్లాలోని 10 దుకాణాలకు వివిధ ప్రాంతాల నుంచి 133 మంది దరఖాస్తుదారులు జిల్లా పరిషత్ సమావేశ భవనానికి చేరుకున్నారు. ఎక్సైజ్, పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఎక్కడా చిన్న సంఘటన కూడా చోటుచేసుకోకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. కానీ నిర్దేశించిన సమయానికి కలెక్టర్ రాక పోవడంతో జాయింట్ కలెక్టర్ నవ్య చేరుకుని ఈ ప్రక్రియను పూర్తి చేశారు. ముందుగానే పలు ప్రాంతాల నుంచి వచ్చిన దరఖాస్తుదారులు దాదాపు రెండు గంటల పాటు నిరీక్షించారు. దరఖాస్తుదారులను ఎక్సైజ్ పోలీసులు సముదాయిస్తూ వారిని కూర్చోబెట్టేందుకు ఇబ్బంది పడాల్సి వచ్చింది.



లాటరీ ద్వారా ఎంపిక చేస్తున్న జేసీ



జిల్లాలోని ఎక్సైజ్ సీఐ, ఎస్ఐ, కానిస్టేబుళ్లు వివిధ ప్రాంతాల నుంచి ఇక్కడికి చేరుకుని ఆయా స్టేషన్‌ల పరిధిలో దరఖాస్తు చేసుకున్న ,వారి వెంటనే ఉండి ఈ ప్రక్రియను పూర్తి చేశారు. కర్నూలు నగర పాలక సంస్థ నుంచి ఈడిగ ధర్మేంద్ర, ఎమ్మిగనూరుకు ఈడిగ నాగేంద్ర, ఆదోని మున్సిపాలిటీకి ఈడిగ ప్రవీణ్‌కుమార్, ఆదోని రూరల్‌కు ఈడిగ ఉరుకుందప్ప, క్రిష్ణగిరి ఈడిగ జ్యోతి గౌడ్, కౌతాళం ఈడిగ బసవరాజు, మద్దికెరకు ఈడిగ మదన గోపాల్, కోసిగి ఈడిగ సుజాత, చిప్పగిరి పెద్ద పూజర్ల చంద్రశేఖర్, ఆస్పరి గిడ్డయ్య గౌడ్ లాటరీ పద్ధతిలో దుకాణాలు దక్కించుకున్నారు. 2024-25 లైసెన్స్ కాలానికి 50 శాతం రాయితీపై 10 దుకాణాల్లో ఒక్కో దానికి రూ. 5 లక్షల చొప్పున ఫీజు రూపంలో రూ. 51,666,69 లక్షలు ఆదాయం సమకూరింది. ఈ ఏడాది రూ. 2.06,671 కోట్లు వీరు చెల్లించాల్సి ఉండగా అందులో నాల్గవ వంతు చెల్లించి దుకాణాలు దక్కించుకున్నారు. లైసెన్స్‌దారులకు దుకాణాలు కేటాయించే విషయంపై ప్రభుత్వం స్పష్టత రావ్వాల్సి ఉంటుంది.

బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహిస్తాం

దేవదాయ శాఖ మంత్రి ఆనం

శ్రీశైలం, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను వైభవోపేతంగా నిర్వహిస్తామని దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అన్నారు. సోమవారం సాయంత్రం 3 గంటలపాటు శివరాత్రి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై కమాండ్ కంట్రోల్ రూములో మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అధ్యక్షతన సమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని అన్నారు. హోల్డింగ్ ఏరియా, పార్కింగ్ ప్రదేశాలను గుర్తించి అక్కడి నుంచి భక్తులను వారి అవసరాలకు తగ్గట్లు తరలించడానికి మొదటి సారిగా ప్రత్యేక మినీ వాహనాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. భక్తుల సౌకర్యార్థం క్యూలైన్లలో ఉచితంగా 200 ఎంఎల్ వాటర్ బాటిల్, పాలు, బిస్కెట్లు అల్పాహారం పంపిణీ చేయాలని మంత్రి ఆదేశించారు. బ్రహ్మోత్సవాల పర్వదినాలలో భాగంగా ఈ నెల 24, 25, 26, 27 తేదీలలో ఉచితంగా స్వామివారి లడ్డూ ప్రసాదం భక్తులకు అందించే విధంగా దేవస్థానం అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ సంవత్సరం భక్తుల సంఖ్య 30 శాతం పెరుగుతుందని, ట్రాఫిక్ సమస్యలను నివారించేందుకు ఆరు డ్రోన్ కెమెరాలను, పర్యవేక్షించేందుకు అవసరమైన మోటారు వాహనాలను ఏర్పాటు చేసుకోవాలని ఎస్పీకి సూచించారు. రెవెన్యూ, పోలీసు, దేవదాయ శాఖలు సమన్వయంతో పని చేసి ప్రముఖుల దర్శనాలకు టైంస్లాటు ఏర్పాటు చేసుకోవాలని అన్నారు. మంత్రులు అనగాని సత్యప్రసాద్, వంగలపూడి అనిత, బీసీ జనార్దనరెడ్డి మాట్లాడుతూ రెవెన్యూ, పోలీసు, దేవదాయ శాఖలు పటిష్టమైన ప్రణాళికలు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈ శివరాత్రి బ్రహ్మోత్సవాలకు రాష్ట్ర ప్రభుత్వం మంత్రుల బృందాన్ని నియమించడం ప్రత్యేకతను సంతరించుకుంది. సమావేశంలో స్థానిక ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి, దేవదాయ శాఖ కమిషనరు రామచంద్రమోహన్, కలెక్టరు జి.రాజకుమారి, జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్, ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా, చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్ చంద్రశేఖర ఆజాద్, దేవస్థానం ఈవో ఎం. శ్రీనివాసరావు, అటవీ శాఖ, పోలీసు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

పల్లె రోడ్డు భళా..!



కోసిగి బీసీ కాలనీలో ఆరు నెలల క్రితం అధ్వానంగా ఉన్న రహదారి



కోసిగి బీసీ కాలనీ రోడ్డు ప్రస్తుతం మారిన తీరు..

నాడు బురద రోడ్లు.. నేడు సీసీ రోడ్లు

కోసిగి: గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వంలో గ్రామీణ ప్రాంతాల్లో సీసీ రోడ్లు లేక రోడ్లన్నీ అధ్వానంగా మారాయి. కానీ కూటమి ప్రభుత్వంలో అధికారంలోకి రావడంతో రోడ్లదశ మారిపోయింది. పంచాయతీలకు నిధులు నేరుగా సర్పంచ్ ఖాతాల్లోకే రావడంతో సీసీ రోడ్లు వేస్తున్నారు. మంత్రాలయం నియోజకవర్గం కోసిగి మండల పరిధిలోని కోల్‌మాన్‌పేటలో బీసీ కాలనీలో 15 సంవత్సరాలుగా సీసీ రోడ్లు లేక తీవ్ర ఇబ్బందులు పడ్డారు. తర్వాత కూటమి ప్రభుత్వంలో సీసీ రోడ్లు వేయడంతో గ్రామానికే కళ వచ్చినట్లయిందని గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



ఎమ్మిగనూరు మండలం కడివెళ్ల గ్రామంలోని పైవీధిలో ఆరు నెలల క్రితం అధ్వానంగా ఉన్న పరిస్థితి



అదే వీధిలో ప్రస్తుతం రహదారి పనులు



ఎమ్మిగనూరు మండలం కడివెళ్ల గ్రామంలోని పైవీధిలో ఆరు నెలల క్రితం అధ్వానంగా ఉన్న రహదారి



అదే వీధిలో ప్రస్తుతం వేగంగా జరుగుతున్న రహదారి పనులు

ఎమ్మిగనూరులో మారిన రోడ్లు

ఎమ్మిగనూరు రూరల్: ఎమ్మిగనూరు మండలం కడివెళ్ల గ్రామంలోని పైవీధిలోని దృశ్యాలివి. ఈ వీధుల్లో ఏన్నో ఏళ్లుగా సీసీ రోడ్లు లేకపోవడంతో ప్రజలు అష్టకష్టాలు పడేవారు. వర్షం వచ్చిందంటే వర్షపునీరు రోడ్లపై నిలిచి కనీసం నడిచేందుకు కూడా వీలులేకుండా ఉండేది. వీధుల్లో నీరు ఎక్కడికి వెళ్లకుండా స్తంభించిపోయి దోమలు ప్రబలి ఎంతో మంది ప్రజలు విష జ్వరాలబారిన పడ్డారు. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వ రోడ్లపై దృష్టి సారించింది. ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర్ రెడ్డి గ్రామాన్ని సందర్శించి రహదారి వేయించాలని అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం ఆ గ్రామంలో సీసీ రోడ్డుతో పాటు డ్రైనేజీ పనులు చక చకా జరిగిపోతున్నాయి.



నాడు మురుగు నీరుతో పచ్చగా మారిన రోడ్డు దుస్థితి



ప్రస్తుతం సీసీ రోడ్డు వేయడంతో అందంగా ఉన్న రోడ్డు

తీరిన వందేళ్ల కల

మద్దికెర: పత్తికొండ నియోజకవర్గం మద్దికెర గ్రామంలోని కవిరెడ్డి వీధి, మద్దమ్మ ఆలయ పరిసర ప్రాంతంలో వందేళ్లగా రహదారి సౌకర్యం లేదు. వీధిలో రాకపోకలు సాగించాలన్నా రైతులు వాముదొడ్లకు వెళ్లి పశువులకు మేత తేవాలన్నా ఎవరైనా చనిపోతే శ్మశానానికి తీసుకెళ్లాలన్నా.. ఆ ప్రాంతమంతా దుర్వాసనలో దుర్భర జీవితాలు సాగించేవారు. అంగన్‌వాడీ కేంద్రం, ప్రాథమిక పాఠశాల, హెల్త్ కేంద్రం ఉన్నాయి. కానీ రోడ్డు లేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రోడ్డు వేశారు. దీంతో ఆ ప్రాంతంలో వందేళ్ల కళ తీరింది. 'పల్లె పండుగ'లో భాగంగా రూ.10లక్షలతో సీసీ రోడ్డు వేశారు.

మంచి రోజులు వచ్చాయి



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రోడ్లపై దృష్టి సారించింది. గ్రామాలకు మంచి రోజులు వచ్చాయి. మా ప్రాంతాల్లో రోడ్లు వేయడం వల్ల దుర్వాసన తప్పిపోయింది. రోడ్లు అందంగా మారాయి.

-గౌడుగు సతీష్ కుమార్, మద్దికెర

ఎన్నో ఏళ్ల తర్వాత వేశారు



మా ప్రాంతంలో ఎన్నో ఏళ్ల తర్వాత రోడ్డు వేశారు. కవిరెడ్డి వీధి నుంచి వెళ్లాలంటే ఇబ్బందిగా ఉండేది. చాలాదూరం చుట్టూ తిరిగి వెళ్లేవాళ్లం. ఇప్పుడు రోడ్డు వేయడంతో రాకపోకలకు బాగుంది. పాఠశాలలు, హెల్త్ కేంద్రాలు ఉండటంతో దుర్వాసన తప్పింది.

-కవిరెడ్డి కృష్ణ, మద్దికెర

నిధులు మంజూరు చేశాం



మద్దికెర మండలంలోని కవిరెడ్డి వీధి ప్రాంతంలో ఎన్నో ఏళ్లుగా రాకపోకలు నిలిచిపోవడమే కాకుండా మురుగు నీరు నీల్వ ఉండటం వల్ల దుర్వాసన వస్తుండేది. రూ.10 లక్షల నిధులు మంజూరు కావడంతో రోడ్డు వేయించాం. ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూశాం.

- డి.అనిత యాదవ్, ఎంపీపీ, మద్దికెర



ఎమ్మిగనూరు నియోజకవర్గం గోనెగండ్ల మండలంలోని అగ్రహారంలో నాడు మురికి గుంటలా ఉన్న బీసీకాలనీ రోడ్డు



ప్రస్తుతం అదే కాలనీలో ఇలా సీసీ రోడ్డు



ఎమ్మిగనూరు నియోజకవర్గం గోనెగండ్ల మండలంలోని తిప్పనూరు ఎస్సీ కాలనీలో నాటి మట్టి రోడ్డు



అదే వీధిలో ప్రస్తుతం వేగంగా జరుగుతున్న రహదారి పనులు

పల్లెపండుగతో పల్లెల్లో అభివృద్ధి

గోనెగండ్ల: పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా కూటమి ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించింది. ఎమ్మిగనూరు నియోజకవర్గం గోనెగండ్ల మండలంలోని అగ్రహారం, తిప్పనూరు ఎస్సీ కాలనీల్లో అధ్వానంగా ఉన్న రహదారులు నేడు సీసీ రోడ్లతో కళకళలాడుతున్నాయి.

మంత్రి ఇలాకాలో మారిన రోడ్లు

బనగానపల్లె: బనగానపల్లె మండలం రామతీర్థం గ్రామంలో ఎస్టీ కాలనీనుంచి మెయిన్ రోడ్డు వరకు గతంలో రహదారి అధ్వానంగా ఉండేది. ప్రస్తుతం ఆ కాలనీలో ప్రభుత్వం రోడ్లు వేయించింది. రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి సొంత నియోజకవర్గం కావడంతో నియోజకవర్గ వ్యాప్తంగా రహదారులపై ప్రత్యేక దృష్టి సారించారు. అందులో భాగంగానే నియోజకవర్గ వ్యాప్తంగా సీసీ రోడ్లకు అధిక ప్రాధాన్యమిస్తున్నారు.





నంద్యాల జిల్లా బనగానపల్లె మండలం రామతీర్థం గ్రామంలో ఎస్టీ కాలనీ నుంచి మెయిన్ రోడ్డు వరకు నాడు-నేడు రహదారి పరిస్థితి


స్టేట్ క్యాన్సర్ హాస్పిటల్ పోస్టుల ప్రొవిజనల్ లిస్టు విడుదల

కర్నూలు హాస్పిటల్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): స్టేట్ క్యాన్సర్ హాస్పిటల్‌కు సంబంధించిన పోస్టుల రివైజ్డ్ ప్రొవిజనల్ మెరిట్ లిస్టును కర్నూలు, నంద్యాల జిల్లాల వెబ్‌సైట్‌లో విడుదల చేసినట్లు కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ డా.కే.చిట్టినరసమ్మ ఓ ప్రకటనలో తెలిపారు. Https:kurnool.ap.gov.in మరియు Https:nandyal.ap.gov.in మరియు Https:kurnool medical college.ac.in వెబ్‌సైట్‌లోని అప్‌లోడు చేసినట్లు వెల్లడించారు. అభ్యర్థులు ఈ జాబితాలో వివరాలు చూసుకుని ఏమైనా అభ్యంతరాలు ఉంటే ఈ నెల 11 నుంచి 15వ తేదీ ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటలలోపు కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్‌కు లిఖిత పూర్వకంగా సమర్పించాలన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ ప్రాక్టికల్స్ పరీక్షలు

కర్నూలు ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 10: (ఆంధ్రజ్యోతి): ఇంటర్ ప్రాక్టికల్స్ పరీక్షలు సోమ వారం ప్రశాంతంగా జరిగాయి. 67 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొత్తం 3,562 మంది విద్యార్థులు నమోదు చేసుకున్నారు. ఇందులో 3,445 మంది పరీక్షకు హాజరు కాగా, 117 మంది గైర్హాజరయ్యారు. అలాగే మధ్యాహ్నం జరిగిన ప్రాక్టికల్స్ పరీక్షలకు మొత్తం విద్యార్థులు 2,892 మంది నమోదు చేసుకున్నారు. ఇందులో 2,839 మంది పరీక్షకు హాజరు కాగా 53 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ప్రాక్టికల్స్ పరీక్ష కేంద్రాలను ఆర్ఐవో కన్వీనర్ గురువయ్య శెట్టి, డీవీఈవో పరమేశ్వరరెడ్డి, స్పెషల్ ఆఫీసర్ జి.లాలెప్ప, డీఈసీ సభ్యులు నాగభూషణంరెడ్డి, పద్మావతి పర్యవేక్షించారు.

వెండి రథంపై ఆదిదంపతుల విహారం


వెండి రథోత్సవంపై అమ్మవార్లు

శ్రీశైలం, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): శ్రీశైల క్షేత్రంలో సోమవారం వెండి రథోత్సవం వైభవంగా సాగింది. భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్లను సాయంత్రం వెండి రథంపై అలంకరించి క్షేత్రవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. ముందుగా స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు ప్రత్యేక పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి వేదికపై ఆశీనులను చేసి, అర్చకులు వేదమంత్రోచ్ఛరణలతో పూజలు జరిపారు. అనంతరం సహస్ర దీపాలంకరణ సేవను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, ఆలయ అధికారులు, సిబ్బంది, శివసేవకులు పాల్గొన్నారు.

ఘంటసాలతో అనుబంధం మరచిపోలేనిది

సినీ రచయిత డాక్టర్ ఎంకే రాము

కర్నూలు కల్చరల్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): తెలుగు సినీ నేపథ్య గాయకుడు, సంగీత దర్శకుడు ఘంటసాల వెంకటేశ్వరరావుతో ఉన్న అనుబంధం మరచిపోలేనిదని హైదరాబాదుకు చెందిన సినీ రచయిత డాక్టర్ ఎంకే రాము అన్నారు. సోమవారం రాత్రి నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో కొనసాగుతున్న ఘంటసాల ఆరాధనోత్సవాలు రెండోరోజు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. టీజీవీ కళాక్షేత్రం, కర్నూలు ఘంటసాల గాన కళాకమిటి సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమాల్లో తొలుత ఘంటసాల చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో డాక్టర్ ఎంకే రాము మాట్లాడుతూ డాక్టర్ సి. నారాయణరెడ్డి, నటసామ్రాట్ అక్కినేని నాగేశ్వరరావులతో కలిసి రసమయి సాహితీ సాంస్కృతిక సంస్థను స్థాపించి 57 ఏళ్లు అయిందని గుర్తు చేసుకున్నారు. గుండెవైద్య నిపుణులు డాక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ గత 25 ఏళ్లుగా హార్ట్ ఫౌండేషన్ ద్వారా నగరంలో ఘంటసాల సంగీత విభావరులు నిర్వహిస్తూ గాయకులను ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. సమావేశానికి అధ్యక్షత వహించిన టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య మాట్లాడుతూ టీజీవీ కళాక్షేత్రంలో నిత్య కల్యాణం పచ్చతోరణంలా సాహితీ, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ వెనుక మాజీ ఎంపీ టీజీ వెంకటేశ్ కృషి, సహకారం ఎంతో ఉందని చెప్పారు. ఘంటసాల గాన కళాసమితి అధ్యక్షుడు బీఎస్ రావు మాట్లాడుతూ ఘంటసాల ఆరాధనోత్సవాలు నిర్వహించుకోవడంతోపాటూ వివిధ ప్రాంతాలకు చెందిన గాయకులతో సంగీత విభావరి నిర్వహించడం స్ఫూర్తిదాయకంగా నిలుస్తోందని చెప్పారు.


డాక్టర్ ఎంకే రామును సత్కరిస్తున్న డాక్టర్ చంద్రశేఖర్, పత్తి ఓబులయ్య, బీఎస్ రావు తదితరులు

అలరించిన సంగీత విభావరి: ఘంటసాల ఆరాధనోత్సవాల్లో భాగంగా రెండోరోజు సోమవారం నిర్వహించిన సంగీత విభావరి ప్రేక్షకులను మైమరపించింది. కాకినాడకు చెందిన సీవీ రమణ, హైదరాబాదుకు చెందిన అఖిల బృందం ఆలపించిన గీతాలు అలరించాయి. డాక్టర్ ఎంకే రాముతో పాటు గాయకులను ఘనంగా సత్కరించారు. కళాక్షేత్రం కార్యదర్శి మమ్మద్ మియా, ఇతర ప్రతినిధులు జీవీ శ్రీనివాసరెడ్డి, కే బాలవెంకటేశ్వర్లు, యాగంటీశ్వరప్ప, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. మంగళవారం సాయంత్రం 6.30 గంటలకు ఘంటసాల ఆరాధనోత్సవాలు ముగింపు వేడుకలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమానికి రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్, సినీ నిర్మాత బీవీ రెడ్డి, విద్యాసంస్థల అధినేత జి.పుల్లయ్య తదితరులు హాజరవుతారని నిర్వాహకులు తెలిపారు.

టీడీపీలో చేరిన వైసీపీ కార్పొరేటర్

కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన గౌరు దంపతులు

కల్లూరు, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): నగర పాలక సంస్థ పరిధిలోని 37వ వార్డు కార్పొరేటర్ అయోషాసిద్దిఖి వైసీపీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరారు. సోమవారం పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత, నందికొట్కూరు టీడీపీ ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు. మాధవీనగర్‌లోని ఎమ్మెల్యే స్వగృహంలో గౌరు దంపతులు 37వ కార్పొరేటర్‌కు టీడీపీ కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానిం చారు. ఈ సందర్భంగా గౌరుచరిత మాట్లాడుతూ రాష్ట్రంలో సీఎం చంద్రబాబు అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలకు ఆకర్షితులై టీడీపీలో చేరుతున్నట్లు తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వంలో విధ్వంస పాలనకు ప్రజలు చరమగీతం పాడారని, చివరికి కార్పొరేటర్లు వైసీపీని వీడి టీడీపీలో చేరుతున్నారన్నారు. కార్యక్రమంలో నంద్యాల తెలుగు యువత జిల్లా అధ్యక్షురాలు


కార్పొరేటర్‌కు టీడీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న గౌరు దంపతులు

కె.పార్వతమ్మ, కర్నూలు మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ పెరుగు పురుషోత్తంరెడ్డి, తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ యాదవ్, కార్పొరేటర్ పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ ఉద్యోగులకు పదోన్నతులు


నియామక పత్రాన్ని అందుకుంటున్న సందీప్ నాయక్

కర్నూలు కలెక్టరేట్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వీఆర్వో గ్రేడ్-1, జూనియర్ అసిస్టెంట్లుగా పని చేస్తున్న 57 మంది రెవెన్యూ ఉద్యోగులకు సీనియర్ అసిస్టెంట్లుగా, ఆర్ఐలుగా పదోన్నతులు లభించాయి. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో పదోన్నతులు పొందిన వారికి కలెక్టర్ రంజిత్ బాషా సంబంధిత పత్రాలను అందజేశారు. వీరికి రెండు రోజుల్లో పోస్టింగ్ కార్యాలయాలను రెవెన్యూ శాఖ అధికారులు కేటాయించనున్నారు. వీరి ద్వారా 41 సీనియర్ అసిస్టెంట్లు, 8 ఎలక్షన్ సీనియర్ అసిస్టెంట్లు, 8 ఆర్ఐ స్థానాలు భర్తీ కానున్నాయి.

పీఎం సూర్యఘర్‌కు స్పాట్ రిజిస్ట్రేషన్ సౌకర్యం

విద్యుత్‌శాఖ ఎస్ఈ ఎం. ఉమాపతి


మాట్లాడుతున్న ఎస్ఈ ఎం.ఉమాపతి

కల్లూరు, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి సూర్యఘర్ పథకం వినియోగదారులకు చేరువ చేయడానికి స్పాట్ రిజిస్ట్రేషన్ సౌకర్యం కల్పించనున్నట్లు విద్యుత్‌శాఖ ఎస్ఈ ఎం. ఉమాపతి అన్నారు. సోమవారం సాయంత్రం ఆయన విద్యుత్ భవన్‌లో విద్యుత్ అధికారులు, సోలార్ వెండర్లతో సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా ఎస్ఈ మాట్లాడుతూ పీఎం సూర్యఘర్ పథకాన్ని ప్రజలకు మరింత చేరువ చేసేందుకు కర్నూలు నగరంలోని ప్రధాన కూడళ్లలో స్టాల్స్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ పథకంపై ప్రజలకు అవగాహన కల్పించడంతోపాటు స్పాట్‌లో రిజిస్ట్రేషన్ చేసి లక్ష్యాలను పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా వినియోగదారులకు గతంలో సోలార్ యూనిట్స్‌కు సెటిల్మెంట్ ప్రతి ఆరు నెలలకు ఒకసారి జరిగేదని, ప్రస్తుతం సీఎం సూర్యఘర్ కింద చేసుకున్న వినియోగదారులకు అదనంగా గ్రిడ్డుకు అందించిన యూనిట్స్‌కు తర్వాతి నెలనే వారి బ్యాంకు అకౌంట్‌లో వేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ డీఈ ఓబులేసు, కర్నూలు టౌన్ డివిజన్ ఈఈ టి.శేషాద్రి, ఎస్ఏఓ చిన్నరాఘవులు అధికారులు పాల్గొన్నారు.


ఆలయం వెలుపల మంత్రులు బీసీ, ఆనం, ఎమ్మెల్యే బుడ్డా

మల్లన్న సేవలో మంత్రులు

శ్రీశైలం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): శ్రీశైల భ్రమరాంబ, మల్లికార్జున స్వామివార్లను సోమవారం రాత్రి రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత, రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి, శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డిలు దర్శించుకున్నారు. మంత్రులు, ఎమ్మెల్యేకు దేవస్థానం ఈఓ ఎం.శ్రీనివాసరావు, అర్చకులు రాజగోపురం వద్ద ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారి ఆలయంలోని వేదఆశీర్వచణ మండపంలో సత్కరించి, తీర్థప్రసాదాలను అందజేశారు.


మంత్రులను ఆలయ మర్యాదలతో సత్కరిస్తున్న ఈవో శ్రీనివాసరావు, అర్చకులు



మల్లన్న సన్నిధిలో మంత్రులు అనిత, అనగాని

రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయురాలి మృతి

నంద్యాల క్రైం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): కర్నూలు-కడప జాతీయ రహదారి బొగ్గులైన్ సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రభుత్వ ఉపాధ్యాయురాలు నాన్సి మేరి (58) మృతి చెందింది. ట్రాఫిక్ సీఐ బి.మల్లికార్జున గుప్త వివరాల మేరకు.. నంద్యాల మూడో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని హనీఫ్ నగర్‌కు చెందిన మూరతోటి అగస్టీన్, నాన్సి మేరి దంపతులు సోమవారం శుభ కార్యానికి వెళ్లారు. తిరుగు ప్రయాణంలో ద్విచక్ర వాహనంపై వస్తుండగా బొగ్గులైన్ సమీపంలో వీరి వాహనాన్ని కారు ఢీ కొంది. దీంతో నాన్సి మేరి అక్కడికక్కడే మృతి చెందింది. తీవ్రంగా గాయపడ్డ భర్త అగస్టీన్‌ను స్థానికులు నంద్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఘటనా ప్రాంతాన్ని తాలుకా పోలీసులు పరిశీలించారు. మృతురాలు శిరివెళ్ల మండలం యర్రగుంట్ల జడ్పీ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పని చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నంద్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మల్లికార్జున గుప్త తెలిపారు.

నగల వ్యాపారికి బెదిరింపు కాల్స్

గూడూరు, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బంగారు నగల వ్యాపారికి బెదిరింపు ఫోన్ కాల్స్ వచ్చాయి. సోమవారం బం గారు నగల వ్యాపారి డమాం వెంకటేశ్వర్లు గూడూరు పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ తిమ్మయ్యకు ఫిర్యాదు చేసారు. గూడూరు పట్టణంలో డమాం వెంకటేశ్వర్లు బంగారు నగల వ్యాపారం చేస్తున్నాడు. గత సంవత్సరం డమాం వెంకటేశ్వర్లును ఒందరు వ్యక్తులు డబ్బుల కోరకు కిడ్నాప్ చేసిన సంఘటన తెలిసిందే. ఆ సంఘటన మరువక ముందే 15 రోజుల నుంచి వీరేష్ అనే వ్యక్తి నుంచి బెదిరింపు ఫోన్ కాల్స్ వస్తున్నాయి. డబ్బులు ఇవ్వకపోతే చంపుతామని అంటున్నారని వెంకటేశ్వర్లు ఎస్ఐ తిమ్మయ్యకు ఫిర్యాదు చేసాడు. ఆయన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తిమ్మయ్య తెలిపారు.

క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి : కలెక్టర్


విద్యార్థినులను అభినందిస్తున్న కలెక్టర్ రంజిత్ బాషా

కర్నూలు కలెక్టరేట్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చిన్నతనం నుంచే క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా పిలుపునిచ్చారు. మినిస్ట్రీ యూత్ అఫైర్స్ స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా, ఆంధ్రప్రదేశ్ రగ్బీ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన రగ్బీ ఉమెన్స్ లీగ్ పోటీల్లో గెలుపొందిన విద్యార్థినులకు సోమవారం కలెక్టరేట్‌లో ప్రోత్సాహక నగదు, బహుమతులు అందజేశారు. క్రీడల ద్వారా మానసిక ఉల్లాసం, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలు కలుగుతాయన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు క్రీడాభివృద్ధికి తగిన ప్రాధాన్యత ఇస్తున్నాయన్నారు నంద్యాల ఆర్జీఎం కళాశాలలో జరిగిన పోటీల్లో అన్ని ప్రభుత్వ, ప్రైవేటు, కేజీబీవీ, ఇంజనీరింగ్, డిగ్రీ కళాశాలల జట్లు పోటీ పడ్డాయనీ, ఇందులో పోటీ పడి కంబలాపాడు, దిన్నెదేవరపాడు, లక్ష్మీపురం, ఆళ్లగడ్డ, ఏపీఎస్‌డబ్ల్యూఆర్ విద్యా సంస్థలకు చెందిన విద్యార్థినులు రూ.2లక్షల ప్రైజ్‌మనీ గెలుచుకున్నారన్నారు. అనంతరం గురుకుల పాఠశాలలో 5వ తరగతి ఇంటర్మీడియట్ ప్రవేశాలకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో గురుకుల పాఠశాల కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీదేవి, డీఎస్‌డీవో భూపతిరావు, ఏపీ రగ్బీ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు పాల్గొన్నారు.

'సబ్సిడీ రుణాల యూనిట్లు పెంచాలి'

కర్నూలు కల్చరల్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని కాపు, బలిజ కులాల వారికి ఇస్తున్న సబ్సిడీతో కూడిన స్వయం ఉపాధి పథకం రుణాల యూనిట్లను పెంచాలని నగర బలిజ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు గాండ్ల లక్ష్మన్న, రవికుమార్, సంఘం గౌరవ సలహాదారులు సింగంశెట్టి సోమశేఖర్, ఈశ్వరకుమార్‌లు విజ్ఞప్తి చేశారు. సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో నిర్వహిస్తున్న ప్రజా పరిష్కార వేదికలో కలెక్టర్ పి. రంజిత్‌బాషాకు వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ 2024-25 ఆర్థిక సంవత్సరానికి కాపు కార్పొరేషన్ ద్వారా జిల్లాలోని బలిజ కులాలకు సూక్ష్మ, చిన్న, మధ్య తరగతి పరిశ్రమల్లో (ఎంఎస్ఎంఈ) మూడు యూనిట్లు మాత్రమే కేటాయించారని, జిల్లాలోని బలిజ కులస్తుల సంఖ్యను దృష్టిలో పెట్టుకొని యూనిట్ల సంఖ్యను పెంచాలని కోరారు. అలాగే దరఖాస్తు చేసుకునేందుకు చివరి తేదీని ఈనెల ఆఖరు వరకు పొడిగించాలని, బీసీలు ఈబీసీలతో సమానంగా వయో పరిమితిని 60 ఏళ్లకు పెంచాలని కోరారు. కుల ధ్రువీకరణ పత్రాల జారీ త్వరితగతిన జరిగేలా రెవెన్యూ అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని వారు కలెక్టర్‌ను కోరారు. ఈ సందర్భంగా కలెక్టర్ స్పందిస్తూ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయి పరిష్కారం కోసం కృషి చేస్తామని హామీ ఇచ్చినట్లు బలిజ సంఘం నాయకులు తెలిపారు.


వినతిపత్రం ఇస్తున్న బలిజ సంఘం నాయకులు

రాజ్య పురస్కార్ టెస్టింగ్ క్యాంపు ప్రారంభం


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న రూరల్ సీఐ బీవీ మధుసూదన్‌రావు

ఎమ్మిగనూరు రూరల్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బనవాసి నవోదయ విద్యాలయంలో సోమవారం రాజ్యపురస్కార్ టెస్టింగ్ క్యాంపు అట్టహాసంగా ప్రారంభమైంది. ముఖ్య అతిథిగా ఎమ్మిగనూరు రూరల్ సీఐ బీవీ మధుసుదన్‌రావు హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. ప్రిన్సిపాల్ పద్మజ మాట్లాడుతూ క్యాంపు 14వ తేదీ వరకు నిర్వహిస్తామన్నారు. 16 నవోదయ విద్యాలయాల భారత్‌స్కౌట్స్, గైడ్స్ 91 మంది, 108 మంది గైడ్స్ విద్యార్థులు వచ్చారని తెలిపారు. భారత్ స్కౌట్స్, గైడ్స్ విద్యార్థులు నైతిక విలువలు పెంపొందించుకోవడం, సౌశీల్య నిర్మాణం, సత్యం పలకడం, కష్టాల్లో ఉన్నవారిని ఆదుకోవడం, రోగగ్రస్థులకు సాయం చేయడం, అత్యవసర సమయాల్లో సహాయ పడడం ద్వారా సమాజ సేవ చేయవచ్చని తెలిపారు. వైస్ ప్రిన్సిపాల్ చందిరన్, అధ్యాపకులు శ్రీనివాసరావు, వెంకటేష్, ఎల్‌టీసీ స్కౌట్స్ బాబురావు, సిబ్బంది మల్లేశ్వరి, అనిల్‌శాస్త్రి, రమేష్, శివకుమార్, శశికిరణ్ పాల్గొన్నారు.

జీడీపీలో 2.128 టీఎంసీలు

- హంద్రీనీవా నుంచి ప్రాజెక్టులోకి రోజుకు 150 క్యూసెక్కులు
- రోజుకు 30 క్యూసెక్కుల నీరు అవిరి


గాజులదిన్నె ప్రాజెక్టులో 2.128 టీఎంసీలుగా నీటి నిల్వ

గోనెగండ్ల, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది అనుకున్న స్థాయిలో వర్షాలు కురిసి నీరు రాకపోయినప్పటికీ హంద్రీనీవా, ఎల్లెల్సీ నీరు రావడంతో జీడీపీ కళకళలాడుతోంది. దీంతో ఈ ఏడాది వేసవిలో ప్రాజెక్టు కింది తాగునీటి పథకాలకు నీటి కొరత ఉండదని అధికారులు భావిస్తున్నారు. ప్రస్తుతం ప్రాజెక్టులో 2.128 టీఎంసీ నీరు ఉంది. హంద్రీ నీవా నుంచి రోజుకు 150 క్యూసెక్కు నీరు జీడీపీకి వచ్చి చేరుతున్నట్లు ఇరిగేషన్ అధికారులు తెలుపుతున్నారు. జీడీపీ కింది ఈ ఏడాది దాదాపు 12 నుంచి 13వేల ఎకరాల్లో ఆయకట్టు సాగ యింది. చాల మంది రైతులు వేరుశనగ, పత్తి, మొక్కజొన్న, శనగ, ఆముదాలు, కొర్రను సాగు చేస్తున్నారు. సాగు చేసిన పంటకు సాగు నీరు విడుదల చేస్తున్నారు. అయితే జీడీపీ అధికారులు కుడి, ఎడమ కాలువ నుంచి నీరు వృథా కాకుండా రైతులకు అవసరమైన సమయంలో నీరు విడుదల చేసి నీటిని వృథా కానీయడం లేదు.

తాగునీటి పథకాలకు...

ఈ ఏడాది గాజులదిన్నె ప్రాజెక్టులో ఇప్పటికీ 2.128 టీఎంసీల నీరు ఉంది. ప్రాజెక్టు కింద తాగునీటి పథకాలు బండగట్టు, జీన్, క్రిష్ణగిరి ఉన్నాయి. ఈ పథకాలకు ప్రతి రోజు జీడీపీ నుంచే నీరు విడుదల అవుతోంది. ఈ మూడు పథకాలకు రోజుకు 10 క్యూసెక్కుల నీరు విడుదల చేయాల్సి ఉంటుంది. అవసర సమయంలో కర్నూలు, కోడుమూరు, గూడురు, బెళగల్, లద్దగిరి, ప్రాంతాలకు నీరు ప్రాజెక్టు నుంచి మళ్లించాల్సి ఉంటుంది.

సాగు నీటి వివరాలు..

ప్రాజెక్టు కింద ఆయకట్టు రైతులు ఈ ఏడాది 12వేల ఎకరాల నుంచి 13వేల ఎకరాల్లోపు పంటలు సాగుచేసుకున్నారు. వారికి అధికారికంగా మార్చి నెల చివరి వరకు నీరు విడుదల చేయాలి. అయితే పంటలు పూర్తిగా చేతికి అందాలంటే ఏప్రిల్ నెల 15 వరకు నీటి విడుదల చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. ఏప్రిల్ 15 వరకు నీరు విడుదల చేయాలంటే ఒక టీఎంసీ నీరు అవసరం అవుతుంది. ప్రస్తుతం ఉన్న 2.128 టీఎంసీ నీటిలో ఒక టీఎంసీ పంటలకు పోగా మిగిలిన 1.128 టీఎంసీలలో ఈ వేసవి జూన్ నెల చివరి వరకు తాగునీటి పథకాలకు మరో టీఎంసీ నీరు సరిపోతుందని ఇరిగేషన్ అధికారులు లెక్కలు వేస్తున్నారు. అయినప్పటికీ మరి కొంత నీరు ప్రాజెక్టులో మిగిలి ఉంటుదని అధికారులు తెలుపుతున్నారు. మిగిలిన టీఎంసీ నీరు ఇతరత్ర అత్యవసరాలకు వినియోగించుకోవచ్చునని తెలుస్తుంది.

రోజుకు 30 క్యూసెక్కులు ఆవిరి

ప్రాజెక్టులో నీరు దాదాపు 24 కిలో మీటర్లు పరిధిలో విస్తరించింది. వేసవిలో భూమిలోకి నీరు ఇంకిపోవడం, ఆవిరి రూపంలో కొంత నీరు వృథా కావటం, చూట్టుపక్కల రైతులు పైపులు మోటార్లతో నీటిని వినియోగించుకోవడంతో ఇప్పటి నుంచి రోజకు 30 క్యూసెక్కుల నీరు వృథా అవుతోంది. ఎండవేడిమి పెరిగే కొద్ది నీటి ఆవిరి పెరుగుతోంది. అయినప్పటికీ ఈ ఏడాది ప్రాజెక్టు తాగునీటి పథకాలకు నీటి ఇబ్బంది లేదని ఆధికారులు తెలుపుతున్నారు.

యాగంటి శివరాత్రి బ్రహ్మోత్సవాల పోస్టర్ విడుదల


పోస్టర్‌ను విడుదల చేస్తున్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

బనగానపల్లె, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని యాగంటి ఉమామహేశ్వరస్వామి శివరాత్రి బ్రహ్మోత్సవాల పోస్టర్‌ను మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి మంత్రి క్యాంపు కార్యాలయంలో సోమవారం విడుదల చేశారు. బీసీ జనార్దన్‌రెడ్డి, బీసీ ఇందిరమ్మ, ఈవో చంద్రుడు, మౌళీశ్వరరెడ్డి, ప్రధాన అర్చకులు మహేశ్ తదితరుల ఆధ్వర్యంలో పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ నెల 25వ తేదీ నుంచి మార్చి 1వ తేదీ వరకు ఐదు రోజుల పాటు జరిగే యాగంటి ఉమామహేశ్వ రస్వామి వార్ల కళ్యాణోత్సవం, రథోత్సవం, వసంతోత్సవం, తెప్పోత్సవం పోస్టర్‌ను విడుదల చేశారు. మంత్రి మాట్లాడుతూ భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా బ్రహ్మోత్సవాలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో బనగానపల్లె పట్టణ ఉప సర్పంచ్ బురానుద్దీన్, టీడీపీ నాయకులు నారాయణరెడ్డి, శంఖేశ్వరరెడ్డి, బత్తుల గోపాల్‌రెడ్డి, సిబ్బంది ప్రసాద్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటి సర్వే

కర్నూలు లీగల్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు జిల్లాల్లో విభిన్న సామర్థ్యం గల పిల్లలు, బాలలలో ఆరోగ్య లోపాలతో ఉన్న పిల్లలను గుర్తించడానికి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఇంటింటి సర్వేను సోమవారం నుంచి ప్రారంభించినట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి తెలిపారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు ఈ సర్వే ఈ నెల 24 వరకు కొనసాగుతుందని సర్వేలో పారా లీగల్ వలంటీర్లు, ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లతో కూడిన బృందాలు సర్వే చేపడుతాయని తెలిపారు. చిన్న పిల్లల్లో అనారోగ్యాన్ని ప్రారంభ దశలోనే గుర్తిస్తే వారికి సత్వర చికిత్స అందించి మంచి బాలలుగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తామని ఆయన తెలిపారు. సీనియర్ న్యాయవాది జి. నాగేశయ్య, బద్దెల లక్ష్మీనారాయణ, పారా లీగల్ వలంటీర్లు పాల్గొన్నారు



సర్వే ప్రారంభించిన న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి

బతికి ఉండగానే చంపేశారు

ఓ రోగి వేదన.. తమకు సంబంధం లేదన్న అధికారులు
ఆంధ్రజ్యోతి ప్రవేశంతో అధికారుల్లో కదలిక

నంద్యాల రూరల్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): బతికి ఉండగానే రికార్డుల్లో చనిపోయినట్లు అధికారులు చూపించారు. నంద్యాల మండలం అయ్యలూరు గ్రామంలో ఈ ఘటన జరిగింది. అంకగాళ్ల చిన్న లింగమయ్య తన ఆవేదనను ఆంధ్రజ్యోతితో పంచుకున్నాడు. కూలీ పని చేసుకొని జీవించే లింగమయ్య ఆగస్టు 26, 2022లో కర్నూలులోని కిమ్స్ ఆసుపత్రిలో కిడ్నీ మార్పిడి ఆపరేషన్ చేయిం చుకున్నాడు. ఆయన భార్య సుభాషిణి కిడ్నీ దానం చేసింది. 2022 సెప్టెంబరు, అక్టోబరు నెలల్లో అయ్యలూరు సచివాలయ సిబ్బంది కర్నూలుకు వచ్చి పింఛన్ ఇచ్చారు. తర్వాత డాక్టర్ల సూచన మేరకు సంవత్సరం పాటు కర్నూలు ఆసుపత్రి సమీపంలో ఉంటూ చికిత్స తీసుకున్నాడు. అనంతరం గ్రామానికి వచ్చి పింఛన్ గురించి నంద్యాల ఎంపీడీవో కార్యాలయానికి వెళ్లి అడిగితే పింఛన్ ఐడీ 1131126203 పరిశీలించి రికార్డులలో 2021 సెప్టెంబర్‌లోనే నీవు చనిపోయినట్లు ఉందని తెలిపారు. సచివాలయంలో అడగగా తమకు సంబంధం లేదన్నారు. జిల్లా వైద్యాధికారి కార్యాలయంలో కూడా అట్లాగే నమోదై ఉన్నది. తాను బతికి ఉండగానే చనిపోయినట్లు రికార్డుల్లో నమోదు చేశారని, దీంతో రేషన్ రావటం లేదని, ఆరోగ్యశ్రీ కార్డు కూడా రద్దు అవుతుందని లింగమ య్య ఆవేదన చెందాడు. ఆరు నెలల నుంచి అధికారులు ఒకరి మీద ఒకరు నెపం వేసుకుంటూ తప్పించుకుంటున్నారని ఆయన అన్నాడు.


బాధితుడు చిన్నలింగమయ్య

దొంగ బంగారం కొనుగోలుపై విచారణ

- వ్యాపారి అరెస్టును అడ్డుకున్న గోల్డ్ మర్చంట్ అసోసియేషన్ ప్రతినిధులు


దుకాణం వద్ద విచారణ చేస్తున్న దోర్నాల పోలీసులు

ఆత్మకూరు, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఓ బంగారు దుకాణదారుడిని దోర్నాల పోలీసులు సోమవారం విచారించారు. వివరాలు ఇలా ఉన్నాయి. ప్రకాశం జిల్లాలోని దోర్నాల ప్రాంతంలో చోరీలకు పాల్పడిన ఓ దొంగ అక్కడి పోలీసులకు చిక్కాడు. విచారణ చేపట్టగా సుమారు 25 గ్రాముల బంగారాన్ని ఆత్మకూరు పట్టణంలోని కప్పలకుంటలో గల ఎం.వాహీద్ జ్యువెలర్స్ షాపులో విక్రయించినట్లు తేలింది. సోమవారం దోర్నాల ఎస్సై మహేష్ పోలీసు సిబ్బందితో కలిసి బంగారు దుకాణం వద్దకు వచ్చారు. దొంగ వద్ద బంగారు కొనుగోలు చేయడం చట్టరీత్యా నేరమని అరెస్టు చేయడానికి సిద్ధమయ్యారు. దీంతో గోల్డ్ మర్చంట్ అసోషియేషన్ అధ్యక్షులు ఎంఎ రషీద్‌తో పాటు మిగిలిన బంగారు దుకాణాల యజమానులు షాపులను మూసివేసి అతడిని అరెస్టు చేయకుండా అడ్డుకున్నారు. సరైన ఆధారాలు లేకుండా ఎవరో దొంగ వచ్చి ఫలానా షాపు అని చూపినంత మాత్రాన వారెంట్ లేకుండా ఎలా అరెస్టు చేస్తారని నిలదీశారు. ఇలా అయితే బంగారు దుకాణాలను కూడా నడపలేని పరిస్థితులు ఉంటాయని అన్నారు. దీంతో పంచాయతీ కాస్త ఆత్మకూరు పోలీసుస్టేషన్ వరకు వెళ్లింది. కాగా ఎంతో కొంత అమౌంట్ చెల్లించి సమస్యను క్లియర్ చేసుకోవాలని సదరు బంగారు దుకాణ యజమాని మంతనాలు జరిపినట్లు తెలిసింది. మొత్తానికి ఈ వ్యవహారంలో దోర్నాల పోలీసుల తదుపరి చర్య ఎలా ఉంటుందన్నది తెలియాల్సి ఉంది.







సహకార సంఘాలది కీలకపాత్ర: కలెక్టర్


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్

కర్నూలు కలెక్టరేట్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): స్థిరమైన అభివృద్ధిని పెంపొందించడంలో సహకార సంఘాలు కీలకపాత్ర పోషిస్తాయని కలెక్టర్ పి.రంజిత్‌బాషా అన్నారు. సోమవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో అంతర్జాతీయ సహకార సంవత్సరం సందర్భంగా పోస్టర్ ను ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఐక్యరాజ్య సమితి అధికారికంగా 2025వ సంవత్సరాన్ని అంతర్జాతీయ సహకార సంవత్సరంగా (ఐవైసీ) సహకార సంస్థ బీఎల్‌డీఏ బెటర్ వరల్డ్ అనే నినాదంతో నెలవారి లక్ష్యాలను నిర్ధేశించిందన్నారు. ఈ మేరకు జాతీయ లక్ష్యాలకు అనుగుణంగా ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా ఐవైసీ స్టేట్ అపెక్స్ కమిటీని ఏర్పాటు చేశారన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ బి.నవ్య, అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, డీఆర్వో సి. వెంకట నారాయణమ్మ, డీసీవో రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన రాష్ట్ర స్థాయి యోగా లీగ్ పోటీలు


విజేతలకు బహుమతి ప్రదానం చేస్తున్న అతిథులు

కర్నూలు స్పోర్ట్స్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): యోగా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో గత రెండు రోజులుగా పెద్దపాడులోని వేదాన్ని పాఠశాలలో నిర్వహిస్తున్న ఒకటో రాష్ట్ర స్థాయి యోగా లీగ్ పోటీలు సోమవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమానికి నగర పాలక సంస్థ డిప్యూటీ మేయర్ రేణుక ముఖ్యఅతిథిగా హాజరై గెలుపొందిన క్రీడాకా రులకు బహుమతులు ప్రదానం చేశారు. రాష్ట్ర యోగా సంఘం ప్రధాన కార్యదర్శి అవినాశ్ శెట్టి మాట్లడుతూ లీగల్ పోటీలు ఓవరాల్ చాంపియన్లుగా కర్నూలు జిల్లా జట్టు 105 పాయింట్లతో నిలిచిందని, 95 పాయిట్లతో అనంతపురం జిల్లా జట్టు రెండో స్థానంలో నిలిచిందని, 92 పాయింట్లుతో నంద్యాల జిల్లా జట్టు మూడో స్థానంలో నిలిచిందన్నారు. కార్యక్రమంలో వేదాన్ని పాఠశాల కరస్పాండెంట్ పరమేష్, పోటీల నిర్వహక అధ్యక్ష, కార్యదర్శులు దండు విద్యాసాగర్, ఫయాజ్, యోగా సంఘం సభ్యులు ఈశ్వర్ నాయుడు, ముంతాజ్, బేగం, పద్మలత పాల్గొన్నారు.

ఆర్థికవృద్ధిలో ఎంఎస్ఎంఈ సర్వే కీలక పాత్ర

కర్నూలు న్యూసిటీ, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): దేశ సామాజిక ఆర్థిక వృద్ధిలో సూక్ష్మ, చిన్న, మధ్య తరహ పరిశ్రమలు(ఎంఎస్ఎంఈ) సర్వే కీలక పాత్ర పోషిస్తుందని నగర పాలక అడిషనల్ కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలో వ్యాపారాలకు సంబం దించి ప్రతి షాపు, పరిశ్రమల నుంచి పూర్తి స్థాయిలో వివరాలను ప్రత్యేక యాప్‌లో నమోదు చేస్తున్నామన్నారు. దీని ద్వారా అవన్నీ డిజిటల్ ప్లాట్ ఫాంలోకి వస్తాయని, ఎనిమిది అంశాలపై సర్వే చేస్తున్నామన్నారు. ఇందులో వ్యాపార యజమాని ఎవరు? వ్యాపారం ఎలా ఉంది? సిబ్బంది కొరత ఏమైనా ఉందా? కొత్త సాంకేతికత వినియోగిస్తున్నారా? సిబ్బందికి శిక్షణ అవసరమా? బ్యాంకు నుంచి రుణాలు పొందుతున్నారా? ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా? సరుకు ఎవరికి ఎగుమతి చేస్తారు? ట్రేడింగ్లో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా? వంటి వివరాలను సచివాలయ సిబ్బంది సేకరిస్తారన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే ఎంఎస్ఎంఈ, ఇతరత్రా ప్రోత్సాహకాలు, ఇరు ప్రభుత్వాలు ఆహ్వానించే టెండర్లలో పాల్గొనేందుకు అర్హత లభిస్తుందని వెల్లడించారు.

ఏఐవైఎఫ్ రాష్ట్ర సమితి సభ్యులకు అభినందన

కర్నూలు న్యూసిటీ, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళంలో జరిగిన ఏఐవైఎఫ్ రాష్ట్ర మహాసభల్లో రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా కొంగర శ్రీనివాసులు, రాష్ట్ర సమితి సభ్యుడిగా బీసన్న ఎన్నుకున్నారు. సోమవారం సీఆర్ భవన్‌లో నూతన రాష్ట్ర నాయకులకు సీపీఐ నగర కార్యదర్శి పి.రామక్రిష్ణారెడ్డి ఆధ్వర్యంలో పలువురు అభినందనలు తెలిపారు. ఈసందర్భంగా రామక్రిష్ణారెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర నాయకులుగా ఎన్నికైన వారు నిరు ద్యోగుల సమస్యల పరిష్కారం కోసం పోరాడాలన్నారు. కార్యక్రమంలో సహాయ కార్యదర్శి సి.మహేష్, ఏఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు రమేష్, నగర అధ్యక్షుడు నాగరాజు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలి

సి.బెళగల్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గోనెనాయక్ సర్పంచులకు ఆదేశించారు. సోమవారం ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో కొళాయిల పైపులైన్లు మురుగు కాలువల్లో ఉంటే వాటిని తొలగించాలన్నారు. ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, సర్పంచులు పాల్గొన్నారు.

బీసీ హాస్టల్‌ను ఏర్పాటు చేయాలి

కర్నూలు ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో పాఠశాల స్థాయి విద్యార్థులకు బీసీ హాస్టల్‌ను ఏర్పాటు చేయాలని బీసీ విద్యార్థి సమైఖ్య రాష్ట్ర అధ్యక్షుడు పి.ఆనంద్‌బాబు డిమాండ్ చేశారు. సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ రంజిత్ బాషాను కలిసి వినతిపత్రం అందజేశారు. విద్యార్థి సంఘాల నాయకులు రవిరాజు, నరేష్‌బాబు, సురేంద్ర, రవి బాబు, లక్ష్మన్న ఉన్నారు.

వసతి గృహాలకు మహర్దశ

పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత


వసతి గృహానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే గౌరు చరిత

కల్లూరు, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ వసతి గృహాలకు మహర్దశ రానుందని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత అన్నారు. సోమవారం కల్లూరు మండలం పర్లలో బాలుర నూతన వసతి గృహానికి ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. ఈసందర్భంగా గౌరు చరిత మాట్లాడుతూ సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో విద్యారంగానికి అధిక ప్రాధాన్యం అందిస్తున్నారని వివరించారు. పాణ్యం నియోజకవర్గంలోని ప్రభుత్వ నూతన వసతి గృహాలకు, మరమ్మతులకు నిదులు విడుదల చేశారన్నారు. అందులో భాగంగా పర్లకు రూ.36 లక్షలు, పెద్దపాడుకు రూ.50.80 లక్షలు, ఉలిందకొండకు రూ.55 లక్షలు, ఓర్వకల్లుకు రూ.22 లక్షలు నిధులు మంజూరయ్యాయన్నారు. అనంతరం పర్లలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఏపీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ డి.రామాంజనేయులు, పర్ల సర్పంచ్ హనుమక్క, టీడీపీ నాయకుడు శేఖర్, ఎంపీటీసీ శేషన్న, మహానంది, పెద్దపాడు తిరుమలేశ్వరరెడ్డి, ఉలిందకొండ ఈవీ రమణ, వాకిటి మాదేష్, లక్ష్మీవరదారెడ్డి, జాఫర్ పాల్గొన్నారు.

గోశాలలో ఎమ్మెల్యే దంపతుల పూజలు

కర్నూలు కల్చరల్: కిడ్స్ వరల్డ్ సమీపంలోని గోశాలలో పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి, నందికొట్కూరు టీడీపీ ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డి దంపతులు గోమాతలకు పూజలు చేశారు. గోశాల నిర్వాహకులు ఎమ్మెల్యే దంపతులను సాదరంగా ఆహ్వానించారు. గౌరు దంపతులకు హరిహరపురం పీఠాధిపతి ఆదిశంకరాచార్య, శారద లక్ష్మీనరసింహ పీఠాధిపతి స్వామి వారి ఆశీర్వాదాలు అందజేసి జ్ఞాపిక అందజేశారు.

ఎస్పీని కలిసిన ఎమ్మెల్యే దంపతులు

కర్నూలు క్రైం: కర్నూలు జిల్లా ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన విక్రాంత్ పాటిల్‌ను పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి, నందికొట్కూరు నియోజకవర్గ ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డి దంపతులు మర్యాదపూర్వకంగా కలిశారు. సోమవారం ఎస్పీ కార్యాలయంలో ఎస్పీని కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. నియోజవకర్గంలోని శాంతిభద్రతలపై వారు ఎస్పీతో చర్చించారు.

సమస్యల పరిష్కారంలో అలసత్వం వద్దు

అడిషనల్ కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ


అడిషనల్ కమిషనర్‌కు సమస్యలు విన్నవిస్తున్న ప్రజలు


ఓర్వకల్లులో ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న తహసీల్దార్

కర్నూలు న్యూసిటీ, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు అలసత్వం వహించొద్దని నగర పాలక అడిషనల్ కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ అన్నారు. సోమవారం నగర పాలక కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. వివిధ సమస్యలకు సంబంధించి ప్రజల నుంచి వచ్చిన అర్జీలను ఆయన స్వీకరించారు. కార్యక్రమంలో ఎస్ఈ రాజశేఖర్, మేనే జర్ చిన్నరాముడు, ఆరోగ్య అధికారి కె.విశ్వేశ్వరరెడ్డి, ఆర్ఓ జునైద్, టీపీ ఆర్ఓ వెంకటలక్ష్మి, టిడ్కో అధికారి పెంచలయ్య పాల్గొన్నారు.

● చదువుల రామయ్య కాలనీలో వీధిలైట్లు వేయాలని, తాగునీటి సమస్యను పరిష్కరించాలని సీపీఐ నాయకులు నగర పాలకలో అడిషనల్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సహాయ కార్యదర్శి సి.మహేష్, శ్రీనివాసరావు, నాగరాజు, బీసన్న, రంగన్న ఉన్నారు.

ఓర్వకల్లు: ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చిన అర్జీలను పరిష్కరించాలని తహసీల్దార్ విద్యాసాగర్ అన్నారు. సోమవారం ఓర్వకల్లు తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ విద్యా సాగర్, ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో శ్రీనివాసులు, ప్రజల నుంచి వచ్చిన వినతులను స్వీకరించారు. కార్యక్రమంలో ఈవోఆర్‌డీ సుబ్బరా యుడు, ఆర్ఐ పాణ్యం వెంకటేశ్వర్లు, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ శ్రీనివాసులు, ఏపీవో కుమారసాయినాథ్ పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇళ్ల పట్టాలు ఇవ్వాలి: సీపీఎం


సచివాలయ అడ్మిన్‌కు వినతి పత్రం ఇస్తున్న సీపీఎం నాయకులు

కర్నూలు న్యూసిటీ, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): అర్హులైన పేదలందరికీ ఇళ్ల పట్టాలు ఇవ్వాలని సీపీఎం నాయకులు కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం నగర పాలక పరిధిలోని 1, 3, 43వ వార్డు సచివాలయాల ఎదుట సీపీఎం అధ్వర్యంలో ధర్నా చేశారు. అనంతరం సచివాలయ అడ్మిన్‌కు వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా నగర కార్యదర్శి రాజశేఖర్ మాట్లాడుతూ నగరంలో గత 30 సంవత్సరాలుగా నివసిస్తున్న అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు, రూ.5లక్షల సబ్సిడీతో కూడిన రుణ సౌకర్యం కల్పించాలన్నారు. ప్రభుత్వం నిత్యావసర ధరలను పెంచ డంతో సామాన్యులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. కార్యక్రమంలో నగర కార్యదర్శి టి.రాముడు, జిల్లా కమిటీ సభ్యులు నగేష్, ఎం.కుమారి, ఎస్ఎండీ షరీఫ్, శాలిబాషా పాల్గొన్నారు.

ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ


విద్యార్థినికి ఆల్బెండజోల్ మాత్రలు వేస్తున్న ఎంపీడీవో

కోడుమూరు, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా స్థానిక జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో సోమవారం విద్యార్థినులకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఏసీ రాముడు, ఎంఈవో తైమూర్ బాషా, ప్రధానోపాధ్యాయులు నాగరాజ కుమారి, డాక్టర్ మదన్ శేఖర్, హెల్త్ సిబ్బంది నరసప్ప, కమాల్ సాహెబ్ పాల్గొన్నారు.

క్లాప్ మిత్రలను నియమించుకోవాలి

ఓర్వకల్లు, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల్లో క్లాప్ మిత్రలను నియమించుకోవాలని ఎంపీడీవో శ్రీనివాసులు అన్నారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టాలని, తాగునీటి సమస్య తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ఈవోఆర్‌డీ సుబ్బరా యుడు, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీర్ శ్రీనివాసులు, ఏపీవో కుమార సాయినాథ్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

శ్మశాన వాటిక సమస్యను పరిష్కరించండి

కర్నూలు కలెక్టరేట్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం మండలం చెట్నహళ్లి గ్రామంలో హిందూ శ్మశాన వాటిక సమస్యను పరిష్కరించాలని కోరుతూ సోమవారం కలెక్టరేట్ కార్యాలయం ముందు గ్రామస్థులు ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ కార్యాలయంలోని ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ రంజిత్ బాషాకు వినతి పత్రం అందజేశారు.

అర్చకులపై దాడులు చేస్తే ఉపేక్షించం

కర్నూలు కల్చరల్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): ఇటీవల ఆలయాల అర్చకులపై దాడులు ఎక్కువ అయ్యాయని, ఇకపై దాడులు చేస్తే ఉపేక్షించేది లేదని అఖిల భారతీయ బ్రాహ్మణ మహాసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవళ్ల వసంత సాయినాథ శర్మ, దక్షిణాంధ్ర రాష్ట్ర కోఆర్డినేటర్ ప్రతాపగిరి సునీల్‌కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. చిలుకూరు బాలాజీ దేవస్థానం ప్రధాన అర్చకుడు రంగరాజన్‌పై జరిగిన దాడిని ఖండించారు. సోమవారం నగరంలోని సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. చిలుకూరు దేవస్థానం ప్రధాన అర్చకుడిపై దాడి చేసిన వీర రాఘవరెడ్డిని, అతని అనుచరులను అరెస్టు చేయాలని వారు డిమాండ్ చేశారు.

● **దాడిని ఖండిస్తున్నాం...** చిలుకూరు బాలాజీ దేవస్థానం ప్రధాన అర్చకుడు రంగరాజన్‌పై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని అఖిల భారత శ్రీవైష్ణవ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి అగ్రహారం రాఘవేంద్ర ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కొందరు దుండగులు హైందవ వేషధారణలతో చలామణి అవుతున్నారని, వీర రాఘవరెడ్డి అతని 40 మంది అనుచరులు రంగరాజన్‌పై దాడిచేయడం బాధాకరమన్నారు.

నగర పాలకలో మొరాయించిన సర్వర్

కర్నూలు న్యూసిటీ, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): నగర పాలక కార్యాలయంలోని పన్ను వసూళ్ల కేంద్రంలో సర్వర్ మొరాయించింది. సోమవారం గంటన్నరపాటు సర్వర్ పనిచేయకపోవడంతో ప్రజలు ఇబ్బంది పడ్డారు. విషయం తెలుసుకున్న మేనేజర్ చిన్నరాముడు అడిషనల్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే రాష్ట్ర పురపాలక శాఖ టెక్నికల్ సిబ్బందితో మాట్లాడి సమస్యను పరిష్కరించారు. అనంతరం మేనేజర్ పన్ను చెల్లింపుదారులను సముదాయించారు.

'చర్యలు తీసుకోవాలి'

గూడూరు, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): పెంచికలపాడు గ్రామంలో మినీ ట్యాంకును ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని టీడీపీ నాయకులు కె.కృష్ణ, హలీఫ్ బాషా అన్నారు. సోమవారం గూడూరులోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో శివనాగ ప్రసాద్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని పెంచికలపాడు బీసీ కాలనీలో అప్పటి టీడీపీ జడ్పీటీసీ టీకె నాగజ్యోతి 2018లో మైనింగ్ గ్రాంట్ కింద పైపులైన్‌తోపాటు మినీ ట్యాంకును ఏర్పాటు చేశారన్నారు. అయితే బీసీ కాలనీలో మినీ ట్యాంకును సర్పంచ్ భర్త ధ్వంసం చేశారన్నారు. ప్రస్తుతం బీసీ కాలనీ వాసులు నీటి కోసం ఇబ్బందులు పడుతున్నారన్నారు.

18న అనుగొండలో రామిరెడ్డి తాత తిరుణాల

కోడుమూరు రూరల్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని అనుగొండలో ఈనెల 18న అవధూత రామిరెడ్డితాత తిరుణాల జరగనున్నట్లు గ్రామస్థులు తెలిపారు. సోమవారం వారు మాట్లాడుతూ వేకవజామున మేలుకొలుపు, సుప్రభాతం, పంచామృతాభిషేకం, అర్చన, నామసంకీర్తన, అనంతరం రామిరెడ్డితాత కాంస్య విగ్రహ శోభాయాత్ర, మధ్యాహ్న హారతి, అన్నదానం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

● **పోచమ్మ, కర్రెమ్మ జాతర:** అనుగొండలో గ్రామదేవతలు పోచమ్మ, కర్రెమ్మ అమ్మవార్ల జాతర వేడుకలు నిర్వహించనున్నట్లు గ్రామస్థులు తెలిపారు. ఇందులో భాగంగా ఈనెల 18న గ్రామ ఆలయాల్లో టెంకాయలు సమర్పణ, పోచమ్మ అమ్మవారి ఆలయంలో పందిరి అలంకరణ, పెండ్లికుమార్తెను చేయుట, 19న పూలతొట్టి, పొంగులొట్టి, శాంతిపూజలు, హారతులు, సాయంత్రం కర్రెమ్మ అమ్మవారి ఆలయంలో పూజలు, హార తులు జరిపించనున్నట్లు వివరించారు.

● **20న ఎద్దుల బండలాగు పోటీలు:** అనుగొండలో రామిరెడ్డితాతా తిరుణాల, పోచమ్మ, కర్రెమ్మ అమ్మవార్ల జాతర వేడుకలను పురస్కరించుకుని ఈనెల 20న రాష్ట్రస్థాయి ఎద్దుల బండలాగు పోటీలు ఏర్పాటు చేశారు. పోటీలో మొదటి విజేతకు డోన్ ఎమ్మెల్యే కోట్ల జయసూర్యప్రకాశ్‌రెడ్డి రూ.30వేలు, రెండో విజేతకు కోట్ల హరిచక్రపాణిరెడ్డి రూ.22వేలు, మూడో విజేతకు హరికిరణ్, సుబ్రమణ్యం రూ.17వేలు, నాలుగో విజేతకు ఎర్రలింగన్న రూ.12వేలు, ఐదో విజేతకు జిన్ను రాజయ్య రూ. 10 వేలు, ఆరో విజేతకు చిన్న అయ్యన్న రూ. 9వేలు, వరుసగా ఏడు, ఎనిమిది, తొమ్మిది, పదో విజేతలకు నగదు బహుమతి అందజేస్తారని నిర్వాహకులు తెలిపారు.

ఉచిత వినికిడి వైద్య శిబిరం పొడిగింపు


వినికిడి పరీక్ష చేస్తున్న ఆడియాలజిస్టు బి. శివకృష్ణ

కర్నూలు హాస్పిటల్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): కర్నూలు గౌరిగోపాల్ హాస్పిటల్ సమీపంలో ఉన్న శ్రీకృష్ణ స్పీచ్ అండ్ హియ రింగ్ సెంటర్లలో ఏర్పాటు చేసిన ఉచిత వినికిడి వైద్యశిబిరాన్ని మంగళ వారం వరకు పొడిగించినట్లు సెంటరు నిర్వాహకుడు ఆడియాలజిస్టు బి.శివకృష్ణ తెలిపారు. గత నాలుగు రోజులుగా జరిగిన ఈ శిబిరానికి దాదాపు 130 మంది రోగులు సద్వినియోగం చేసుకున్నారన్నారు. పేద వారిని దృష్టిలో పెట్టుకుని మంగళవారం వరకు శిబిరాన్ని కొనసా గిస్తున్నట్లు ఆయన తెలిపారు.

చిన్నారుల్లో వైకల్యం గుర్తింపునకు ఇంటింటి సర్వే


వివరాలు తెలసుకుంటున్న రాయపాటి శ్రీనివాస్

కర్నూలు కల్చరల్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి ఆదేశాల మేరకు 0 నుంచి 6 సంవత్సరాలలోపు చిన్నారుల్లో పుట్టుకతో ఉన్న లేదా ప్రాథమిక దశలో గుర్తించగల వైకల్యాం గుర్తింపునకు ఇంటింటి సర్వే కార్యక్రమాన్ని నిర్వహించారు. సోమవారం నగరంలోని 42 వార్డు ఇల్లూరునగర్, ఇంది రాగాంధీ నగర్ ప్రాంతాల్లో పారా లీగల్ వలంటీర్, చైల్డ్ ఫ్రెండ్లీ లీగల్ సర్వీసెస్ ఫర్ చిల్డ్రన్ స్కీం కమిటీ సభ్యుడు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, ఏఎన్ఎం జీవిత, ఆశా వర్కర్ టీవీ పుష్పావతి, అంగన్‌వాడీ వర్కర్ శకుంతల తదితరులు ఇంటింటి సర్వేలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాయపాటి శ్రీనివాస్ మాట్లాడుతూ ఈనెల 10 నుంచి 24 వరకు జరిగే ఇంటింటి సర్వేలో ప్రాథమిక దశలో గుర్తించగలిగిన వైకల్యాలను ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో ఉన్న డీఈఐసీ సెంటర్‌కు పంపిస్తామని తెలిపారు.

కార్యవర్గం ఎన్నిక

కల్లూరు, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): కల్లూరు మండల పంచాయతీ కార్యదర్శుల సంఘం నూతన కార్యవర్గం సోమవారం రాష్ట్ర పంచాయతీ కార్యదర్శుల సంఘం కోశాధికారి డి.శేషన్న ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కల్లూరు మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా కె.సంజీవయ్య రోహిణి, ఉపాధ్యక్షురాలిగా కవిత, కోశాధికారిగా సురేం ద్రలను ఎన్నుకు న్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు రమాదేవి, చంద్రకళ, బిందుభార్గవి, వరలక్ష్మి, సిద్దు, విశ్వతేజ, శీను, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి


జడ్పీ ఉన్నత పాఠశాలను తనిఖీ చేస్తున్న ఎంఈవో

సి.బెళగల్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందించాలని మండల విద్యాధికారి జ్యోతి వంట ఏజెన్సీలకు ఆదేశించారు. సోమవారం మండల కేంద్రంలోని జిల్లా ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించని వంట ఏజెన్సీలకు బిల్లులు నిలిపే స్తామని హెచ్చరించారు. ఎంఈవో వెంట ఎంఆర్‌సీ రాజరావు, సీఆ ర్‌పీలు నాగేష్, శోభరాణి, వెంకటరాముడు, మాదన్న ఉన్నారు.

పదిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి


పది విద్యార్థినులతో మాట్లాడుతున్న ఎంఈవో సునీలమ్మ

గూడూరు, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి విద్యార్థులు బాగా చదివి వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని మండల విద్యాశాఖ అధికారి సునీలమ్మ అన్నారు. సోమవారం గూడూరు పట్టణంలోని కేజీబీవీ పాఠశాల, జడ్పీ బాలురు, బాలికలు పాఠశాలలను ఆమె సందర్శించారు. పదో విద్యార్థులతో ఎంఈవో మాట్లాడారు. పది తరగతి విద్యార్థులు ప్రధానమంత్రిచే నిర్వహించబడిన పరీక్షపై చర్చా కార్యక్రమాన్ని వీక్షించారు. అనంతరం మధ్యాహ్న భోజనం తనిఖీ చేశారు.

శివరాత్రి ఉత్సవాలకు ముహూర్తం ఖరారు


లగ్నపత్రికను ఈవోకు అందజేస్తున్న అర్చకులు

ఓర్వకల్లు, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని కన్నమడకల గ్రామ సమీపంలో వెలసిన బుగ్గ రామలింగేశ్వరస్వామి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు సోమవారం ముహూర్తం ఖరారైంది. ఈవో చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో అర్చకులు చంద్రశేఖర్ శర్మ లగ్నపత్రిక రాసి స్వామివారి ఎదుట ఉంచి ప్రత్యేక పూజలు చేశారు. ఈ నెల 25 నుంచి 27 వరకు మహాశివరాత్రి బ్రహ్మోత్సవలు నిర్వహిస్తున్నట్లు ఈవో తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు సుధాకర్‌రావు, బొల్లవరం వెంకటేశ్వర్లు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు విద్యార్థులు ఎంపిక


ఎంపికైన విద్యార్థులతో అతిథులు

కర్నూలు స్పోర్ట్స్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్‌లో జాతీయ స్థాయి సబ్ జూనియర్ అండర్-15 పోటీలకు ఆదర్శ పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు జిల్లా రగ్బి అసోసియేసన్ అధ్యక్షుడు గుడిపల్లి సురేందర్ తెలిపారు. పల్నాడు జిల్లా ఫిరంగిపురంలో జనవరి 24, 25 తేదీల్లో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచారన్నారు. ఎం.భరత్, కే.సూరిలను రాష్ట్ర జట్టుకు ఎంపిక చేశారన్నారు. ఈ నెల 15, 16 తేదీల్లో మధ్యప్రదేశ్ రాష్ట్రం గ్వాలియర్‌లో జరిగే అండర్-15 చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొంటారని ఆదర్శ విద్యాసంస్థల అధినేత బి.తిమ్మయ్య, ప్రిన్సిపాల్ రమా మాధవి తెలిపారు. వ్యాయామ ఉపాధ్యాయులు మహబూబ్‌సుభాని, శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఫ్లైఓవర్‌కు మరమ్మతులు

కర్నూలు న్యూసిటీ, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్ ఎదురుగా ఉన్న ఫ్లైఓవర్‌కు మరమ్మతులు చేపట్టారు. గత కొంతకాలంగా కలెక్టరేట్ నుంచి ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు పాదచారులు వెళ్లే ఇనుప ఫ్లైఓవర్ శిథిలావస్థకు చేరింది. ఫ్లైఓవర్ పైన ఉండే ఐరన్ రేకులు చిలుము పట్టి ఊడిపోవడానికి సిద్ధంగా ఉన్నాయి. దీంతో కొద్ది కాలంగా ఆ ఫ్లైఓవర్‌పై ఎవ్వరు కూడా వెళ్లడం లేదు. ఈ క్రమంలో ప్రైవేట్ సంస్థకు చెందిన వ్యక్తులు మరమ్మతులు చేపట్టారు. చిలుము పట్టిన ఐరన్ రేకుల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేస్తున్నారు. మరమ్మతులు చేసే సమయంలో బారికేడ్లు ఏర్పాటు చేయడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. రాత్రికి పూర్తవుతుందని సంస్థ ప్రతినిధులు తెలిపారు.

కంది రైతు గగ్గోలు..

- కొనుగోళ్లను ప్రారంభించి.. వదిలేసిన అధికారులు
- అవస్థలు పడుతున్న రైతులు


కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అధికారులు(ఫైల్)


కందులను నూర్పిడి చేస్తున్న రైతులు

పత్తికొండ టౌన్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): కంది దిగుబడులను కొంటామన్న అధికారులు పత్తాలేరు. పత్తికొండ మండలం పుచ్చకాయలమడ గ్రామంలో గత నెల 28న డీసీఎంఎస్ సొసైటీ ఆధ్వర్యంలో కందుల కొనుగోలు కేంద్రాన్ని అట్టహాసంగా ప్రారంభించారు. ఇంకేముంది తమ పొలాల్లోని కంది దిగుబడులను అమ్ముకోవచ్చని రైతులు సంతోషించారు. అంతలోనే వారి సంతోషం ఆవిరైంది. కేవలం 150 క్వింటాళ్లను మాత్రమే కొనుగోలు చేసి వదలేయడంతో రైతులు లబోదిబో మంటున్నారు. కొనుగోళ్లను ఎప్పుడు పునఃప్రారంభిస్తారో.. అని ఎదురు చూస్తున్నారు. మద్దతు ధరతో అమ్ముకోవాలన్నా ఆశతో ఎదురు చూస్తున్న రైతన్నల ఆందోళనపై ప్రత్యేక కథనం.

మద్దతు ధరతో కొనాలని నిర్ణయం

మండలంలో ఈ ఖరీఫ్‌లో 4,032 ఎకరాల్లో కంది సాగు చేశారు. ఎకరాకు 4 నుంచి 6 క్వింటాళ్ల దాకా దిగుబడి వచ్చింది. ఈ లెక్కన సుమారు 20వేల క్వింటాళ్ల పైచీలకు దిగుబడి వచ్చింది. కూటమి ప్రభుత్వం రూ.7,750ల మద్దతు ధరతో కొనుగోలు చేయాలని నిర్ణయించి, ఈ బాధ్యతను ఏపీ మార్క్‌ఫెడ్‌కు అప్పజెప్పింది.

అధికారుల నిర్లక్ష్యం

మార్క్‌ఫెడ్ అధికారులు డీసీఎంఎస్ సంస్థకు కొనుగోళ్లను అప్పజెప్పింది. గత నెల 28న పుచ్చకాయలమడ గ్రామంలో డీసీఎంఎస్ ఆధ్వర్యంలో ప్రారంభించి 150 క్వింటాళ్ల మేరకు మాత్రమే కొనుగోలు చేసి అనంతరం పత్తా లేకుండా పోయారు. దీంతో రైతులు తీవ్ర నిరాశ చెందుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి, కందుల కొనుగోళ్లను పునఃప్రారంభించేలా చూడాలని కోరుతున్నారు.

కర్నూలులో విక్రయించా



మూడెకరాల్లో కంది సాగు చేశా. 15 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. ప్రభుత్వం మద్దతు ధరతో కొంటుందని ఆశించా, తీరా కొనుగోలు చేయకపోవడంతో కర్నూలుకు తీసు కెళ్లి అమ్ముకున్నాను. - **సుంకన్న, రైతు పెద్దహుల్తి**

రెండు, మూడు రోజుల్లో ప్రారంభిస్తాం



పుచ్చకాయలమడ గ్రామంలో కందుల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించాం. అనివార్య కారణాలతో కందుల కొనుగోళ్లు నిలిచి పోయాయి. రెండు మూడు రోజుల్లోతిరిగి ప్రారంభించేలా చూస్తాం. - **వెంకట్రాముడు, ఏవో**

భక్తులకు సౌకర్యాలు కల్పిస్తాం

మద్దికెర, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): జాతరలో భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తామని సర్పంచ్ బండారు సుహాసిని, కార్యదర్శి శివకుమార్ అన్నారు. సోమవారం జాతర జరిగే ప్రదేశంలో పంచాయతీ నిధులతో గరుసు వేశారు. సలహాదారుడు బండారు అంజనేయులు, సభ్యులు జంబునాథ్ రాయుడు, కవిరెడ్డి ఉన్నారు.

చంద్రబాబు పాలనలో రాష్ట్రం సుభిక్షం


విగ్రహావిష్కరణలో పాల్గొన్న వైకుంఠం శివప్రసాద్, జ్యోతి

ఆలూరు, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): చంద్రబాబు పాలనలో రాష్ట్రం సుభిక్షంగా ఉందని టీడీపీ ఆర్గనైజింగ్ కార్యదర్శి వైకుంఠం శివప్రసాద్, మహిళా నాయకురాలు వైకుంఠం జ్యోతి అన్నారు. సోమవారం ఆలూరు దేవమ్మ నూతన విగ్రహాల ప్రతిష్ఠించి, పూజలు చేశారు. కూటమి ప్రభుత్వం అవినీతిని అంతమొందించి సూపర్ సిక్స్ పథకాలను విడతల వారీగా అమలు చేస్తోందన్నారు. బెంగళూర్ కిషోర్, జనసేన నాయకులు రంజిత్ పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలకు భవనం నిర్మించాలి


మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు

ఆదోని అగ్రికల్చర్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు పక్కా భవనాన్ని నిర్మించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు డిమాండ్ చేశారు. సోమవారం మాటాడుతూ నూతన విద్యా విధానాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. విద్యారంగ సమస్యలపై పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. అనంతరం కమిటీని ఎన్నుకున్నారు. పట్టణ అధ్యక్షుడిగా శశిధర్, కార్యదర్శి గౌడ్, ఉపాధ్యక్షుడిగా సురేంద్ర, నాగరాజు సహాయ కార్యదర్శులుగా వెంకట్, చిరు, ఉమాకాంత్, పదిమంది సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి అబ్దుల్లా, నాయకులు శివ, నరసింహ, సంజయ్, కిరణ్ పాల్గొన్నారు.

చెన్నకేశవుని కల్యాణోత్సవం


కల్యాణోత్సవంలో బొజ్జమ్మ దంపతులు

దేవనకొండ,ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కప్పట్రాళ్ల కౌలుట్ల చెన్నకేశవ ఆలయంలో సోమవారం కల్యాణం నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం తెల్లవారుజామున నిర్వహించారు. వాల్మీకి కార్పొరేషన్ చైర్‌పర్సన్ బొజ్జమ్మ, రామచంద్రనాయుడు దంపతుల సమక్షంలో వివాహం చేశారు. ఆలయ అధికారి వీరయ్య, సిబ్బంది బాల చెంచన్న ఉన్నారు.

జాతీయ పోటీలకు ఎంపిక

మద్దికెర, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సన్‌రైజ్ పాఠశాల విద్యార్థి పల్లవి మ్యాథమాటిక్స్ అబాకస్‌లో జాతీయ పోటీలకు ఎంపికైనట్లు కరస్పాండెంట్ రవిశేఖర్ తెలిపారు. మండలంలోని పెరవలి గ్రామానికి చెందిన ఈ.నారాయణ, వరలక్ష్మి కూతురు 6వ తరగతి చదువుతోందని, ఈ నెల 9వ తేదీన విజయ వాడలో రాష్ట్రస్థాయిలో గెలుపొందిందన్నారు. మార్చి 3వ తేదీన హైదరాబాదులో పాల్గొంటుందన్నారు. మరో విద్యార్థి హరిప్రణతి రైసింగ్‌స్టార్ బహుమతిని గెలుచుకుందన్నారు. టీడీపీ ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు అభినందించారు.


పల్లవి (ఫైల్)

గర్భిణులకు భోజనం


గర్భిణులకు అన్నం వడ్డిస్తున్న వైద్యులు


పత్తికొండ, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వాసుపత్రిలో ప్రతినెలా 9వతేదీన గర్భిణులకు స్కానింగ్ నిర్వహిస్తారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే గర్భిణులు, సహాయకులకు ఎమ్మెల్యే శ్యాంబాబు ఆధ్వర్యంలో సోమవారం వైద్యాధికారి కల్పన, లోక్‌నాథ్, ఎరుకులచెరువు సురేంద్ర, హరినాథ్‌గౌడ్ భోజనాన్ని వడ్డించారు.

సేవాగుణం కలిగి ఉండాలి

మద్దికెర, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): సేవా గుణం కలిగి ఉండాలని తహసీల్దార్ హుసేన్‌సాహెబ్ సూచించారు. సోమవారం సుబ్రహ్మణ్య స్వామి ఆలయ నిర్వాహకులు ఎస్.విజయప్రసాద్ యాదవ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కొత్తపేట వెంకటేశ్వరరెడ్డి, పి.మల్లికార్జున యాదవ్, గూడూరు ధనుంజయుడు, ఎస్.హరిప్రసాద్ యాదవ్ పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

ఆదోని, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): గ్రామాభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే పార్థసారథి అన్నారు. సోమవారం పెద్దతుంబళం గ్రామంలో సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. స్వయంగా పార చేతబట్టి కొద్దిసేపు పనిచేశారు. అనంతరం మాట్లాడుతూ పెద్దతుంబళం గ్రామ అభివృద్ధికి కూటమి కట్టుబడిఉన్నామని, సమస్యలను తన దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకోవాలన్నారు ఎంపీడీవో రాజేంద్రప్రసాద్, కార్యకర్తలు పాల్గొన్నారు.


పెద్దతుంబళం గ్రామంలో మట్టి పని చేస్తున్న ఎమ్మెల్యే

ప్రజా సమస్యలను వేగంగా పరిష్కరించండి

- సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్


అర్జీలను స్వీకరిస్తున్న సబ్ కలెక్టర్

ఆదోని, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): ప్రజల నుంచి పబ్లిక్ గ్రీవెన్స్‌లో వచ్చిన అర్జీలను వేగవంతంగా పరిష్కరించాలని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ ఆదేశించారు. సోమవారం కార్యాలయంలో పబ్లిక్ గ్రీవెన్స్ డేలో ప్రజల నుంచి వచ్చిన అర్జీలను స్వీకరించారు.

మండలాల నుంచి వచ్చిన సమస్యలు కొన్ని..

1. తాను సర్వే నెం.90ఏ/బీలో 0.73 ఎకరాల భూమి కొనుగోలుచేశానని, సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేయాలని నందవరం మండలం ముగతి గ్రామానికి చెందిన రంగన్న అర్జీ సమర్పించుకున్నారు.
2. ఆదోని పట్టణంలో వీధిలైట్లు సరిగ్గా వెలగడం లేదని 19వ వార్డు శ్రీనివాసాచారి అర్జీ ఇచ్చారు.
3. అర్జీలు ఇవ్వడినికి వచ్చే దివ్యాంగులకు వీల్ చైర్లను ఏర్పాటు చేయాలని పట్టణానికి చెందిన తస్లీమా అర్జీ సమర్పించారు.
4. తనకు సర్వే నెం.442లో 4.00 ఎకరాల భూమి పెద్దల నుంచి వచ్చిందని, ఆన్‌లైన్‌లో నమోదు చేసి పట్టాదారు పాసుపుస్తకం మంజూరు చేయాలని పెద్దకడుబూరుకు చెందిన కుబేర అర్జీ సమర్పించారు.

సర్వేయర్లు శ్రీనివాస్‌రాజు, వేణు సూర్య, డీఎల్‌పీవో నూర్జహాన్, ఏఈ చేతన్‌ప్రియ, ఆర్అండ్‌బీ డీఈ వెంకటేశ్వర్లు, వెంకటరమ ణారెడ్డి, ఆర్టీసి డీఎం రఫి పాల్గొన్నారు.

టెనెక్ట్‌ప్లేస్ ఇంజక్షన్‌తో గుండెకు భరోసా

వెల్దుర్తి, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): గుండెపోటుతో ఎవరూ మరణించరాదన్న ఉద్దేశంతో ప్రభుత్వం టెనెక్ట్‌ప్లేస్ ఇంజక్షన్‌ను అందుబాటులో ఉంచిందని సామాజిక ఆరోగ్య కేంద్రం సూపరింటెండెంట్ బాలచంద్రా రెడ్డి అన్నారు. సోమవారం ఆసుపత్రిలో రోగులకు, అవగాహన కల్పించారు. ఛాతీలో నొప్పి, గుండె దడ, ఎడమవైపు భుజం లాగడం, ఆయాసం పెరగడం, స్పృహతప్పి పడిపోవడం లక్షణాలు కనిపిస్తే గంటలోపు ప్రభుత్వ ఆసుపత్రికి రావాలన్నారు. అవసరమైన వారికి రూ.48 వేల విలువ చేసే ఇంజక్షన్ వేస్తాని, ఇది రక్తం గడ్డ కట్టకుండా పని చేస్తుందన్నారు. వైద్యులు డా.మధుసూదన్ రెడ్డి, డా.రాజశేఖర్, డా.సాహిత్య, డా.చిన్నరంగస్వామి పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న వైద్యులు

ఆదోనిలో వెలగని వీధి దీపాలు


వెలగలని వీధి లైటు

ఆదోని టౌన్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో వీధి దాపాలు వెలగక పోవడంతో పట్టణవాసులు ఇబ్బంది పడుతున్నారు. 42 వార్డులుండగా, దాదాపు 2వేల వీధి దీపాలు ఉన్నాయి. అయితే చాలామటుకు అవి వెలుగడం లేదు. అలాగే 50 ప్రాంతాల్లో వీధి దీపాల టైమర్ పనిచేయని కారణంగా ఎల్ఈడీ బల్బులు రాత్రిళ్ల వెలగడం లేదు మున్సిపల్ అధికారులు స్పందించి వీధి దీపాలు వెలిగేలా చూడాలని మండిగిరి టీడీపీ ఇన్‌చార్జి శ్రీనివాస ఆచారి కోరారు.

కంప్యూటర్ నైపుణ్యం అవసరం

ఆలూరు, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి):విద్యార్థులకు కంప్యూటర్ నైపుణ్యం అవసరమని మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ రాఘవ రావ్, అసెస్మెంట్ అధికారి విజయ్ కుమార్ అన్నారు. సోమవారం పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు కంప్యూటర్ ల్యాబ్, ప్రాక్టికల్స్‌పై అవగాహన కల్పించారు. కంప్యూటర్ పరిజ్ఞానముంటే సులువుగా ఉద్యోగ అవకాశాలు పొందవచ్చన్నారు. కార్యక్రమంలో ఐటీ అధ్యాపకుడు ప్రకాష్ పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల పరిశీలన

ఆదోని టౌన్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పారిశుధ్య పనులను మున్సిపల్ కమిషనర్ కృష్ణ సోమవారం పరిశీలించారు. గోఖర్ ఝుండా, కుమ్మరి వీధి, వాల్మీకి నగర్, మట్కార్‌వాడి, హవన్న పేట ప్రాంతాల్లో చెత్త తరలింపు, వీధులు, కాల్వలు శుభ్రం చేసే పనులను క్షేత్ర స్థాయిలో పర్యవేక్షించి, సిబ్బందికి సూచనల చేశారు. విధుల్లో నిర్లక్ష్యం వహించినా, గైర్హాజరైనా కఠిన చర్యలు తీసుకొంటామని హెచ్చరించారు. అనంతరం శ్రీనివాసభవన్ వద్ద అన్నా క్యాంటిన్‌ను దర్శించి, ఆహార పదార్థాలను పరిశీలించారు.


పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న కమిషనర్ కృష్ణ

గుర్తు తెలియని వ్యక్తి మృతి

ఆలూరు, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బళ్ళారి రోడ్డులో ఓ వ్యక్తి ప్రమాదానికి గురై పడి ఉండటంతో ఆలూరు ఎస్సై దిలీప్ కుమార్ ఆలూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అయితే ఆ వక్తి చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు ఆలూరు పోలీసు స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు.


ఆసుపత్రిలో మృతదేహం

రైతుకు విశిష్ట సంఖ్య తప్పనిసరి

వెల్దుర్తి టౌన్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): రైతులు ప్రభుత్వ పథకాలు, సబ్సిడీలు, వ్యవసాయ సేవలను పొందాలంటే విశిష్ట గుర్తింపు సంఖ్య తప్పనిసరని ఏవో అక్బర్ బాషా అన్నారు. సోమవారం మాట్లాడుతూ సొంత భూమిగల రైతులంతా నమోదు చేయించుకోవాలని పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ , మొబైల్ నెంబర్ తీసుకుని వారి గ్రామాల్లోని రైతు కేంద్రాల్లో నమోదు చేసుకోవాలని తెలిపారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చూడండి

దేవనకొండ, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సీపీఐ నాయకులు ఎంపీడీవో సూర్యనారాయణకు వినతిపత్రం ఇచ్చారు. కార్యదర్శి నర్సారావ్, కృష్ణ, భాస్కర్, నరసింహ ఉన్నారు.

పూర్తి చేయాలి

దేవనకొండ: మండలంలోని రైతుల విశిష్ట సంఖ్య ను నెలాఖరులోపు పూర్తి చేయాలని పత్తికొండ ఏడీఏ మోహన్‌విజయ్‌కుమార్ సూచించారు. సోమవారం .మండలంలోని నెల్లిబండ రైతుసేవా కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఏవో సురేష్‌బాబు ఉన్నారు.


ఆదోని మున్సిపల్ పాఠశాలలో మాత్రలు వేస్తున్న డా. సత్యవతి

నులి పురుగుల నివారణతో ఆరోగ్యం

ఆదోని అగ్రికల్చర్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): నులిపురుగుల నివారణతోనే ఆరోగ్యంగా ఉంటారని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సత్యవతి పేర్కొన్నారు. సోమవారం జాతీయ నులిపురుగుల నివారణ దినం సందర్భంగా మున్సిపల్ పాఠశాల విద్యార్థులకు మున్సిపల్ కమిషనర్ కృష్ణతో కలిసి డాక్టర్ సత్యవతి ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. ఏడాది పిల్లల నుంచి 19 ఏళ్ల వరకు ప్రతి ఒక్కరు ఆరు నెలలకు ఒకసారి ఆల్బెండజల్ మాత్రలను వేసుకోవాలని కోరారు. హెచ్ఎం మల్లికార్జున, డాక్టర్ వినోద్, సూపర్వైజర్ ఇందిరా దోరతి పాల్గొన్నారు.

ఆస్పరి: ఎంపీడీవో గీతావాణి, వైద్య సిబ్బంది విద్యార్థులకు సోవమారం మాత్రలను మింగించారు.

వెల్దుర్తి: మండలంలోని గోవర్ధనగిరి పెహెచ్‌సీ పరిధిలో డా.శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో బింగిదొడ్డి, మాదాపురం, గోవర్ధన గిరి, శ్రీరంగాపురం, లక్ష్మీనగరం, టి.గోకులపాడు, తొగర్చేడు గ్రామాల్లో మాత్రలు పంపిణీ చేశారు. పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యార్థులచే మాత్రలను మింగించారు.

దేవనకొండ: జిల్లా అదనపు వైద్యాధికారి భాస్కర్ జడ్పీ, కస్తూర్బా విద్యార్థులకు మాత్రలను పంపిణీ చేశారు. వైద్యాధికారి బిజయ భాస్కర్ ఉన్నారు.

మద్దికెర: మండలంలోని పాఠశాలలు, అంగన్ వాడీ కేంద్రాల్లో వైద్యాధికారులు శ్రీలక్ష్మి, రాగిణి విద్యార్థులకు మాత్రలను మింగించారు. హెల్త్ ఎడ్యుకేటర్ అక్బర్‌బాషా, ప్రిన్సిపాల్ జ్యోతిరెడ్డి, హెచ్ఎం అజయ్ బాబు ఉన్నారు

గ్యాస్ సిలిండర్లు సీజ్


గ్యాస్ సిలిండర్లను స్వాధీనం చేసుకున్న అధికారులు

ఆదోని రూరల్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక గ్యాస్ సిలిండర్లను ఆదోని మండలంలో పంపిణీ చేస్తున్నారన్న ఫిర్యాదు మేరకు సోమవారం 50 సిలిండర్లను స్వాధీనం చేసుకున్నారు. సోమవారం రెవెన్యూ అధికారులు పోలీసులు పెద్ద హరివాణంలో కర్ణాటక రాష్ట్రం శిరుగుప్ప తాలుక హచ్చోళ్లి రాఘవేంద్రయ్య హెచ్‌పి గ్యాస్ ఏజెన్సీకి చెందిన సిలిండర్లతోపాటు ఆటోను స్వాధీనం చేసుకున్నారు. వీటిని ఆదోనికి తరలించామని, నిందుతులపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు.

చట్టాన్ని అతిక్రమిస్తే కఠిన చర్యలు : సీఐ

ఆస్పరి, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): చట్టాన్ని అతిక్రమిస్తే కటిన చర్యలు తప్పవని డీ మస్తాన్ వలి హెచ్చరిం చారు. సోమవారం మోడల్ జూనియర్ కళాశాల, పూటకలమర్రి విద్యార్థులకు అవగాహన కల్పించారు. దురవాట్లకు లోనుకావద్దని, క్రమశిక్షణతో చదివి ఉన్నతంగా ఎదగాలని కోరారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కోర్టు శిక్షలు విధిస్తాయని పేర్కొన్నారు. ప్రిన్సిపాల్ సమీల, అధ్యాపకులు పాల్గొన్నారు.


మోడల్ స్కూల్‌లో మాట్లాడుతున్న సీఐ మస్తాన్ వలి

గడ్డివామి దగ్ధం

దేవనకొండ, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తెర్నేకల్ గ్రామంలోనడిపి మాదన్న అనే రైతు గడ్డివామి దగ్ధమైంది. బాధితుడి కతనం మేరకు.. సమీపంలో నిప్పంటుకొని మంటలు చేలరేగి గడ్డివామికి వ్యాపిచి, పశువుల మేతతో పాటు, వ్యవసాయ సామగ్రి, ఎడ్ల బండి కాలిపోయాయి. రూ.1 లక్ష నష్టపోనిట్లు బాదితుడు వాపొయ్యాడు.


దగ్ధమవుతున్న గడ్డివామి

కేంద్రాన్ని మార్చండి

దేవనకొండ, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యతి): మండలంలోని నేలతలమర్రి గ్రామం ప్రభుత్వ పాఠశాల వద్ద నిర్మించిన చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రాన్ని మార్చాలని డీఎల్‌పీవో వీరభద్రప్ప సూచించారు. గ్రామస్థుల ఫిర్యాదు మేరకు సోమవారం సోమవారం పరిశీలించారు. పంచాయతీ స్థలంలో నూతన కేంద్రాన్ని నిర్మించాలని సూచించారు. ఎంపీడీవో సూర్యనారాయణ, కార్యదర్శి గీత, పులిరాజు ఉన్నారు.

హంద్రీ నీవా జలాల కోసం పోరాడాలి



ఆర్డీవోకు వినతి పత్రం ఇస్తున్న అఖిలపక్ష నాయకులు

పత్తికొండ టౌన్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): పత్తికొండ అభివృద్ధి కోసం హంద్రీ నీవా జలాల సాధనకు పోరాడాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య పిలుపు నిచ్చారు. సోమవారం అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. హంద్రీనీవా ప్రధాన కాల్వను వెడల్పు చేయాలని, పందికోన రిజర్వాయర్ ఆయకట్టు స్థిరీకరణకు నిధులు కేటాయించాలని ఆర్డీవో భరత్ నాయక్‌కు వినతి పత్రం అందజేశారు. సీపీఎం కార్యదర్శి వెంకటేశ్వరరెడ్డి, వైసీపీ కన్వీనర్ నాగరాజు, లోక్‌సత్తా నాయకులు జయరాముడు మాట్లాడుతూ కాలువను వెడల్పు చేయకుంటే రైతులు, పరజలు ప్రజానీకానికి తీరని నష్టం వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. తుగ్గలి, మద్దికెర మండలాల్లో మినీ రిజర్వాయర్లను ఏర్పాటు చేసి హంద్రీనీవా నీటితో నింపాలని కోరారు. నాయకులు రాజాసాహెబ్, సురేంద్ర కుమార్, నబీ రసూల్, తిమ్మయ్య వెంకట్రామిరెడ్డి పాల్గొన్నారు.

ఉపాధిలో అవినీతి లేకుండా చూస్తా

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

- మద్దికెర ఏపీవో నర్సిరెడ్డి



మద్దికెర, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): జాతీయ ఉపాధి హామీ పథకంలో అవినీతికి తావు లేకుండా చూస్తానని ఏపీవో నర్సిరెడ్డి అన్నారు.

ప్రశ్న: మండలలో ఎన్ని జాబ్‌కార్డులు ఉన్నాయి?
జవాబు: 8 పంచాయతీల్లో 9,548 జాబ్‌కార్డులు ఉన్నాయి. ప్రస్తుతం 7వేల మంది కూలీలు పనులకు వస్తున్నారు.
ప్రశ్న: నూతన జాబ్‌కార్డులు ఇస్తున్నారా?
జవాబు: వ్యవసాయ కూలీలు ఫారం-1పై వివరాలు నమోదు చేసి గ్రామ కార్యదర్శితో సంతకం చేయించుకుని కార్యాలయంలో అందజేస్తే నూతన జాబ్ కార్డు మంజూరు చేస్తాం.
ప్రశ్న: ఉపాధి పనుల్లో అవినీతిని ఎలా అధిగమిస్తారు?
జవాబు: ప్రతి రోజు పనులు జరిగే ప్రదేశానికి వెళ్లి మస్టర్లు, హాజరైన కూలీలను పరిశీలిస్తా. పనుల కొలతలు ఖచ్చితంగా ఉండలా చూస్తా. రూ.300ల కూలి రావాలంటే ఎంత పని చేయాలో వివరిస్తాము.
ప్రశ్న: అన్ని గ్రామాల్లో ఉపాధి పనులు చేస్తున్నారా?
జవాబు: మండలంలోని 11 గ్రామాల్లో ఉపాధి పనులు జరుగుతున్నాయి. రోజుకు సగటున 4వేల మందికి పైగా పనులకు వస్తున్నారు.
ప్రశ్న: ఒక్కో మేటీ కింద ఎంత మంది కూలీలు ఉంటారు?
జవాబు: ఒక్కోల మేటీకి 50 మంది చొప్పున ఉంటారు. మండలంలో శ్రమశక్తి సంఘాలను ఏర్పాటు చేస్తున్నాం.
ప్రశ్న: సిబ్బంది కొరత ఉందా?
జవాబు: సిబ్బంది కొరత లేదు. అన్ని గ్రామాల్లో ఫీల్డ్ అసిస్టెంట్లు ఉన్నారు.
ప్రశ్న: గోకులం షెడ్లు పూర్తయ్యాయా?
జవాబు: 32 మంజూరు కాగా, అన్నీ పూర్తయి ప్రారంభించాం.
ప్రశ్న: గోకులం బిల్లులు వచ్చాయా?
జవాబు: షెడ్ల నిర్మాణాలు పూర్తయినట్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. బిల్లులు మంజూరు కాలేదు. నగదు లబ్దిదారుల ఖాతాలో జమ అవుతుంది.

చెక్క రథంపై ప్రహ్లాదరాయలు


చెక్క రథంపై ఊరేగుతున్న ప్రహ్లాదరాయలు

మంత్రాలయం, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): రాఘవేంద్ర స్వామి మఠంలో ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలు చెక్క రథంపై భక్తులకు దర్శనం ఇచ్చారు. సోమవారం మాఘమాసం త్రయోదశి శుభ దినం సందర్భంగా చెక్క రథాన్ని వివిధ పుష్పాలతో చూడ ముచ్చటగా అలంకరించారు. పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థుల ఆధ్వర్యంలో వేద పండితుల మంత్రోచ్ఛరణాలు, మంగళవాయిద్యాల మధ్య వజ్రాలు పొదిగిన ప్రహ్లాదరాయలను అధిష్టించి ఆలయ ప్రాంగణం చుట్టూ ఊరేగించారు. అనంతరం ఊంజల నిర్వహించారు. అంతకుముందు స్వామి వారికి పూర్ణబోధ పూజమందిరంలో పాదపూజ చేసి పల్లకిలో ఊరేగించి హారతులు ఇచ్చారు.

జోరుగా వరినాట్లు


గాజులదిన్నె ప్రాజెక్టు కింద వరినాట్లు వేస్తున్న మహిళా కూలీలు

గోనెగండ్ల, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): గాజులదిన్నెప్రాజెక్టు కింద వరి నాట్లు జోరుగా సాగుతున్నాయి. మండల వ్యాప్తంగా దాదాపు 700 ఎకరాల్లో వరి నాట్లు వేస్తున్నారు. రైతులు బావులు, బోర్ల దగ్గర వరి నాట్లను వేస్తున్నారు. సోనా మసూర్, జిలకర సోనా, 65 డీపీ, తెల్ల హంస, కర్నూలు సోనా, రకాలను సాగు చేస్తున్నారు. పత్తి పంట ఎండ వేడికి దెబ్బతినడంతో పత్తి పంటను తీసివేసి వరిని సాగు చేస్తున్నారు. గాజులదిన్నె, ఐరన్‌బండ, హెచ్ కైరవాడి, వేముగోడు, పుట్టపాశం, ఎన్నెకండ్ల, గోనెగండ్ల గ్రామాల్లో అధికంగా వరి సాగు చేస్తున్నారు.

పీఎం సూర్యఘర్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

ఎమ్మిగనూరు టౌన్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): పట్టణ ప్రజలు ఎంపీ సూర్యఘర్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని విద్యుత్ శాఖ అధికారులు అన్నారు. సోమవారం వీవర్స్ కాలనీలో పీఎం సూర్యఘర్ స్కీమ్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీఈ నాగేంద్రప్రసాద్, ఈ ఈ విజయరాజులు మాట్లాడుతూ పీయం సూర్యఘర్ స్కిమ్‌ను వాడితే తక్కువ ఖర్చుతో విద్యుత్ వినియోగించుకొని డబ్బుని ఆదా చేసుకోవచ్చన్నారు. ఈ పథకానికి కేంద్రం సబ్సిడీ కూడా ఇస్తుందన్నారు. ఇందుకు బ్యాంకు నుంచి రుణ సదుపాయం కూడా పొందవచ్చాన్నారు. పట్టణ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రజలు పాల్గొన్నారు.

శివపార్వతులకు ప్రత్యేక పూజలు

నందవరం, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ముగతి గ్రామంలో రామలింగేశ్వర ఆలయంలో సోమవారం శివపార్వతులకు ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయంలో ఐదుమంది దంపతులు హోమం చేపట్టారు. అనంతరం అన్నదాన కార్యక్రమం చేపట్టారు, కార్యక్రమంలో సర్పంచ్ విరూక్షిరెడ్డి, సాయిబాబారెడ్డి, మెడికల్ శ్రీనివాసులు, రాఘవరెడ్డి, తారకరాముడు, శేఖర్‌రెడ్డి, తారక్‌రెడ్డి, వీఆర్వో రాఘవేంద్ర, సర్వేయర్ శేఖర్, జయరామ్, సోమేష్, గ్రామస్తులు ఆలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

రాఘవరాయడికి స్వర్ణ కవచ సమర్పణ సేవ

మంత్రాలయం, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): వేదపండితుల మంత్రోచ్ఛరణాలు, మంగళవాయిద్యాల మధ్య రాఘవ్రేంద స్వామి మూల బృందావనానికి బంగారు కవచం సమర్పణ సేవ రమణీయంగా సాగింది. సోమవారం మాఘ త్రయోదశి శుభదినాన్ని పురస్కరించుకొని పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు ఆధ్వర్యంలో పండితులు బృందావనానికి సుప్రభాతం, నిర్మల విసర్జనం, క్షీరాభిషేకం, తులసి అర్చన, విశేష పంచామృతాభిషేకం, హస్తోధకం నిర్వహించారు. బంగారు, వెండి, పట్టు వస్త్రాలు, బెంగుళూరు నుంచి తెచ్చిన ప్రత్యేక పుష్పాలు, బంగారు కవచంతో చూడ ముచ్చటగా అలంకరించారు.

దైవచింతన అలవర్చుకోవాలి

ఎమ్మిగనూరు రూరల్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): శివదీక్షతో దైవచింతన అలవడుతుందని విశ్వబ్రహ్మ హెల్త్‌కేర్ సొసైటీ అధ్యక్షుడు జాలవాడి శ్రీనివాసులు అన్నారు. సోమవారం మండలంలోని బోడ బండ గ్రామంలో శివమాలస్వాములకు సబ్బులు, టూత్‌పేస్టులు, బ్రష్‌లను అందజేశారు. కార్యక్రమంలో శివస్వాములు రామచంద్ర, నరసింహులు, ప్రహ్లాద, నాగేష్ పాల్గొన్నారు.

ఉప్పర సంఘం పట్టణ కమిటీ ఎన్నిక

ఎమ్మిగనూరు టౌన్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఉప్పర (సగర) సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. సోమవారం స్థానిక ఉప్పర కళ్యాణ మండపంలో ఉప్పర సంఘం సభ్యుల జనరల్ బాడీ సమావేశంలో గౌరవ అధ్యక్షులు యుఎం బల్లెన్న, నూతన అధ్యక్షుడు బసరుకోడు వీరేంద్ర అధ్యక్షతన కొత్త కమిటీని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా బండల హరి, ప్రధాన కార్యదర్శి బాలాజి, కోశాధికారిగా మహేష్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

అధ్వానంగా సీసీ రోడ్లు

● ఒకటో వార్డులో ప్రజల అవస్థలు

ఎమ్మిగనూరు, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 1వార్డులో ఉన్న చెడ్డె వీధిలోని రహదారులు అధ్వానంగా మారాయి. దీంతో వీధివాసులు రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పట్టణం లోని ఆయా ప్రాంతాల్లో సీసీ రోడ్లు ఏర్పాటు చేస్తున్నా చెడ్డె వీధిలో సీసీ రోడ్లు ఏర్పాటు చేయకపోవడంపై స్థానిక ప్రజలు అధికారులు, పాలకులపై మండిపడుతున్నారు. గత కొన్నేళ్ల క్రితం 1వ వార్డులోని చెడ్డెవీధితో పాటు సమీప వీధుల్లో సీసీ రోడ్లు ఏర్పాటు చేశారు. అయితే అటు తర్వాత సీసీ లేచిపోయి రాళ్లు తేలాయి. దీంతో కాలనీవాసులు రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాలం వచ్చిందంటే వీధిలో వర్షపునీరు నిలిచి కాలనీవాసులు కనీసం నడిచేందుకు కూడా వీలులేకుండా పోతుంది. రాత్రివేళల్లో వృద్ధులు, పిల్లలు ఇళ్ల నుంచి రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. చిన్నపిల్లలు రాళ్లు, బండలు తగిలి గాయాలపాలవుతున్నారు. కాలనీవాసులు గత ప్రభుత్వ హయాంలో మున్సిపల్ అధికారులకు సీసీ రోడ్లు వేయాలని విన్నవించడంతో అధికారులు సీసీ రోడ్లు ఏర్పాటు చేసేందుకు టెండర్లకు పిలిచారు. టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ సైతం రోడ్లు వేసేందుకు పలుమార్లు కొలతలు తీసుకెళ్లారే తప్ప ఇప్పటి వరకు సీసీ రోడ్లు వేసిన దాఖలాలు లేవు. దీంతో కాలనీవాసుల కష్టాలు మాత్రం తీరలేదు. అధికారులు స్పందించి చెడ్డెవీధిలో సీసీ రోడ్లు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.


చెడ్డెవీధిలో సీసీ రోడ్డులేని దృశ్యం


చెడ్డె వీధిలో రోడ్డు దుస్థితి

పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేశాం



మా వీధిలో సీసీ రోడ్డు రాళ్లు తేలాయి. సీసీ రోడ్డు వేయాలని మున్సిపల్ అధికారులకు పిర్యాదులు చేశాం. అయినా ఇప్పటి వరకు సీసీ రోడ్లు వేయలేదు. దీంతో ఇబ్బందులు పడుతున్నాం. వర్షం వస్తే రోడ్డు పైనే నీరు నిలిచి ఇబ్బందికరంగా మారుతుంది. అధికారులు పరిశీలించి సీసీ రోడ్లు వేయాలి.

\- గోపాల్, కాలనీవాసి

పదేళ్లుగా ఇలాగే ఉంది



పదేళ్లుగా మా వీధిలో రోడ్డు ఇలాగే రాళ్లుతేలి ఉంది. రోడ్డు వేస్తామని కొలతలు పట్టుకున్నారు. అయితే రోడ్డు మాత్రం వేయలేదు. పిల్లలు, ముసలి వాళ్లు రాళ్లు తగిలి కిందపడి గాయాలపాలై ఆస్పత్రి పాలవుతున్నారు. అధికారులు స్పందించి సీసీ రోడ్డు ఏర్పాటు చేయాలి.

\- పార్వతి, కాలనీవాసి

ఇంటి స్థలాలు సాధించే వరకు పోరాటం



ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఐ నాయకులు, మైనార్టీ కాలనీ వాసులు

ఎమ్మిగనూరు రూరల్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): పట్టణం, గ్రామీణ ప్రాంతాల్లోని పేదలకు ఇంటి స్థలాలు సాధించే వరకు తమ పోరాటం ఆగదని సీపీఐ పట్టణ కార్యదర్శి రంగన్న అన్నారు. సోమవారం పట్టణంలోని మైనార్టీ కాలనీ ప్రజలతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం 18వ వార్డులోని సచివాలయం ముందు ధర్నా నిర్వహించి సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలోని పేదలకు రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లోని పేదలకు మూడు సెంట్లస్థలాన్ని ఇచ్చే వరకు తమ పోరాటం ఆగదన్నారు. గతనెల 19న మంత్రి వర్గంలో ఇంటి స్థలాలు ఇవ్వాలని ఆమోదం తెలిపారని అయితే ఇప్పటి వరకు ఇంటి స్థలాలు ఎప్పుడు ఇస్తారో ఖచ్చితంగా చెప్పలేదన్నారు. ఇంటి స్థలాలు ఇచ్చే వరకు పోరాటం తప్పదన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు విజయేంద్ర, వీరేష్, దాదావలి, ఖాజా, ఇస్మాయిల్, అజార్, బాషా, అబ్దుల్, నరసింహులు, నాగరాజు, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

20న వీరబ్రహ్మేంద్ర స్వామి నాటకం

మంత్రాలయం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రచ్చుమర్రిలో ఈనెల 20న బంగారమ్మ గ్రామ దేవర ఉత్సవాలను పురస్కరించుకుని శ్రీమద్విరాట్ పోతులూరు వీరబ్రహ్మేంద్రస్వామి జీవిత చరిత్ర పౌరాణిక నాటకాన్ని ప్రదర్శిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఆయా కళాకారులతో నాటక ప్రదర్శనను ఎంతో ఆధ్యాత్మిక భక్తితో నిర్వహిస్తున్నారని తెలిపారు. బ్రహ్మేంద్రస్వామి జీవితచరిత్ర తెలుసుకుని తరించాలని జెట్టి నరసింహులు, యాగంటి వీరేష్, హర్మోనిస్టు లక్ష్మన్న, హనుమంతు, ధర్మప్ప, కరెన్న కోరారు.

దళితుల శ్మశాన వాటికకు రక్షణ కల్పించాలి


మునిసిపల్ కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఎమ్మిగనూరు టౌన్,ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని దళితుల శ్మశాన వాటికకు రక్షణ కల్పించాలని ఐపీవైఎల్ జిల్లా ప్రధాన కార్యదర్శి చిన్ని ప్రసాద్ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పట్టణంలో దళితుల కోసం మాజీ మంత్రి బీవీ మోహన్ రెడ్డి ఎనిమిది ఎకరాలు స్థలాన్ని కేటాయించి చుట్టూ ప్రహరీ నిర్మించి ఇచ్చారన్నారు. వైపీసీ ప్రభుత్వం లో శ్మశానానికి సీసీ రోడ్డు వేయించారన్నారు. ప్రస్తుతం శ్మశాన వాటికలో బోరు పని చేయడం లేదు, ప్రహరీ పడిపోవడం వల్ల అక్కడ అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయన్నారు. ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి చొరవ తీసుకొని ప్రహరీ నిర్మాణానికి నిధులు కేటాయించాలన్నారు. కార్యక్రమంలో ప్రేమ్‌కుమార్, హరి, డానియల్ పాల్గొన్నారు.

సహకార సంఘాలది కీలకపాత్ర: కలెక్టర్

కర్నూలు కలెక్టరేట్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): స్థిరమైన అభివృద్ధిని పెంపొందించడంలో సహకార సంఘాలు కీలకపాత్ర పోషిస్తాయని కలెక్టర్ పి.రంజిత్‌బాషా అన్నారు. సోమవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో అంతర్జాతీయ సహకార సంవత్సరం సందర్భంగా పోస్టర్‌ను ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఐక్యరాజ్య సమితి అధికారికంగా 2025వ సంవత్సరాన్ని అంతర్జాతీయ సహకార సంవత్సరంగా (ఐవైసీ) సహకార సంస్థ బీఎల్‌డీఏ బెటర్ వరల్డ్ అనే నినాదంతో నెలవారి లక్ష్యాలను నిర్దేశించిందన్నారు.

నర్సింగ్ హోమ్‌ను సీజ్ చేయాలి



తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

ఎమ్మిగనూరు టౌన్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): మౌలిక వసతులు లేనటువంటి ప్రైవేట్ నర్సింగ్‌హోమ్‌లపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ, యూఎస్‌ఎఫ్ఐ, బీసీ, ఎస్సీ మైనార్టీ విద్యార్థి సంఘాల నాయకులు శేఖర్, మహేంద్రబాబు, ఉదయ్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు విలేకరులు సమావేశంలో మాట్లాడుతూ పట్టణంలోని వైఎస్ఆర్ సర్కిల్‌లో ఉన్నటువంటి ప్రైవేట్ నర్సింగ్‌హోమ్‌లో గర్భిణుల నుంచి పెద్ద మొత్తంలో ఫీజులు వసూలు చేస్తున్న వైద్యశాఖ అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదన్నారు. ధనార్జన ధ్యేయంగా వివిధ రకాల ల్యాబ్ టెస్టుల పేరుతో డబ్బులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం తహసీల్దారు శేషఫణికి వినతిపత్రం అందజేశారు. విద్యార్థి సంఘాల నాయకులు అశోక్, ప్రేమ్, యశ్వంత్ పాల్గొన్నారు.

నదికైరవాడిలో రీ సర్వే

నందవరం, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని నదికైరవాడి గ్రామంలో సోమవారం అధికారులు రీ సర్వే నిర్వహించారు. తహసీల్దారు శ్రీనివాసులు, రీ సర్వే డీటీ మహేష్ ఆధ్వర్యంలో సర్వే నిర్వహించారు. ప్రతి రైతుకు ముందుగానే నోటీసులు జారీ చేసి సర్వే నిర్వహించారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ అక్బర్‌బాష, ముగతి శేఖర్, మల్లికార్జునగౌడు, వీఆర్వోలు ముగతి రాఘవేంద్ర, చిన్నకొండన్న, తిప్పన్న, కుమారివాణి పాల్గొన్నారు.

సమస్యలన్నీ పరిష్కరిస్తాం: తహసీల్దారు


అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దారు

నందవరం, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): మీ కోసంలో వచ్చిన సమస్యలన్నీ పరిష్కరిస్తామని తహసీల్దారు శ్రీనివాసులు తెలిపారు. సోమవారం నందవరం తహసీల్దారు కార్యాలయంలో మీ కోసం కార్యక్రమంలో భాగంగా ప్రజలు, రైతులు వినతులు స్వీకరించారు. సమావేశంలో ఎంపీడీవో పుల్లయ్య, పీఆర్ ఏఈ నరసింహులు, ఎంఈవో సుదర్శన్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సత్యనారాయణమూర్తి, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మీనరసింహ స్వామి రథోత్సవం


రథోత్సవానికి హాజరైన జనం

ఎమ్మిగనూరు రూరల్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మసీదుపురం గ్రామంలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి రథోత్సవాన్ని గ్రామ ప్రజలు సోమవారం వైభవంగా నిర్వహించారు. జిల్లాలో ప్రసిద్ధి చెందిన లక్ష్మీనరసింహస్వామికి ఉదయం నుంచే గ్రామస్థులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం లక్ష్మీనరసింహస్వామి మూలవిరాట్‌ను రథంపై ఆశీనులను చేసి ఊరేగించారు. కార్యక్రమంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా రూరల్ ఎస్ఐ శ్రీనివాసులు ప్రత్యేక బందోబస్తును ఏర్పాటు చేశారు.

మా పని మాదే..


వీడియో కాన్ఫరెన్స్‌లో సెల్ ఫోన్లు చూస్తున్న అధికారులు

పెద్దకడుబూరు, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): పక్క చిత్రంలో కనిపిస్తున్న దృశ్యం పెద్దకడుబూరులోని వీడియోకాన్ఫరెన్స్‌లోనిది. ప్రతి సోమవారం జిల్లా అధికారులు ప్రజల సమస్యల పరిష్కారం కోసం వీడియో కాన్ఫరెన్స్‌ను ఏర్పాటు చేస్తారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా అధికారులు ప్రజల సమస్యలు ఎలా పరిష్కరించాలనే విషయాలను స్థానిక అధికారులకు తెలియజేస్తారు. అయితే ఉన్నతాధికారులు నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌ను వదిలేసి స్థానిక అధికారులు కొందరు సెల్‌ఫోన్‌లో.. మరికొందరు తమకు పట్టనట్లుగా మాపని మాదే అన్న..రీతిలో నిమగ్నమవ్వడంతో మండలంలోని ప్రజలు స్థానిక అధికారుల తీరుపై మండిపడుతున్నారు.

అధికారులపై చర్యలు తీసుకోవాలి


ఫిర్యాదు పత్రాన్ని చూపుతున్న బొగ్గుల తిక్కన్న

పెద్దకడుబూరు, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): పెద్దకడుబూరులో ఉన్న కొండకు పట్టాదారు పాసుపుస్తకాలు ఇచ్చిన రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకోవాలని ఎఫ్ఆర్‌టీఐ జిల్లా కార్యదర్శి బొగ్గుల తిక్కన్న డిమాండ్ చేశారు. సోమవారం కర్నూలులో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జాయింట్ కలెక్టర్ నవ్యను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెద్దకడుబూరు రెవెన్యూ పరిధిలో ఉన్న సర్వే నెంబర్ 603/ఏ1 లో 103.89 ఎకరాల కొండ ఉందన్నారు. ఆ కొండలో గత కొన్నేళ్లుగా కొంతమంది సాగు చేసుకుంటూ రెవెన్యూ అధికారుల సహకారంతో పట్టాదారు పాసుపుస్తకాలు పొందారన్నారు. పట్టాదారు పాసుపుస్తకాల సహకారంతో సబ్సిడీ రుణాలను దాదాపు రూ.10లక్షల వరకు పొందారన్నారు. అక్రమంగా పట్టాదారు పాసుపుస్తకాలు ఇచ్చిన అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు.

చట్టాలపై అవగాహన ఉండాలి: ఎస్ఐ


విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న ఎస్ఐ శివాంజల్

మంత్రాలయం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): విద్యార్థిదశ నుంచే చట్టాలపై అవగాహన పెంచుకోవాలని ఎస్ఐ శివాంజల్ అన్నారు. సోమవారం స్థానిక జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రమేష్ అధ్యక్షతన సైబర్, మహిళా చట్టాలు, వంటి అంశాలపై వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి చట్టాలపై అవగాహన పెంచుకొని ఆన్‌లైన్‌లో జరుగుతున్న మోసాలను ఇరుగు పొరుగువారికి వివరించి చైతన్యపరచాలని అన్నారు. సమావేశంలో అధ్యాపకులు మద్దిలేటి, రవి, ఈరన్న, హెడ్ కానిస్టేబుల్స్, ఆంజనేయులు, రామకృష్ణ, పరమేష్ పాల్గొన్నారు.

ప్రశాంతంగా జీవించాలి: డీఎస్పీ


గ్రామస్థులతో మాట్లాడుతున్న డీఎస్పీ ఉపేంద్రబాబు

పెద్దకడుబూరు, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లోని ప్రజలు ప్రశాంతంగా జీవించాలని ఎమ్మిగనూరు డీఎస్పీ ఉపేంద్రబాబు అన్నారు. సోమవారం రాత్రి మండల పరిధిలోని హెచ్.మురవణి గ్రామంలో పర్యటించారు. గ్రామంలోని ప్రజలతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ ఉపేంద్రబాబు మాట్లాడుతూ గ్రామంలోని ప్రజలు ఎలాంటి అల్లర్లకు పాల్పడకుండా జీవించాలన్నారు. ఎవరైనా అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. వాహనాలు నడిపే సమయంలో తప్పకుండా హెల్మెట్ ధరించాలన్నారు. గ్రామంలో ఎవరైనా అనుమానాస్పదంగా తిరుగుతుంటే పోలీసులకు సమాచారం అందజేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ నిరంజన్‌రెడ్డి, ఏఎస్ఐ శివరాముడు పాల్గొన్నారు.

స్థల వివాదంలో ఇరువర్గాల ధర్నాలు


ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు బైఠాయించిన దళితులు

మంత్రాలయం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం మండలంలోని చెట్నహళ్లిలో జరిగిన స్థలం, శ్మశాన వివాదంపై ఇరు వర్గాలు ధర్నాలు చేశారు. బీసీ వర్గానికి చెందిన నాయకులు కర్నూలులో కలెక్టరేట్ ముందు గాంధీ విగ్రహం ముందు ధర్నా చేసి అనంతరం జాయింట్ కలెక్టర్ నవ్యకు, ఎస్పీ విక్రాంత్ పాటిల్‌ను కలిసి తమ వినతి పత్రం అందజేశారు. అదేవిధంగా ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు జైభీమ్ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో దళిత వర్గాలు బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం సబ్ కలెక్టర్ మౌర్యభరద్వాజ్‌కు వినతి పత్రం అందజేశారు. అలాగే ఎమ్మిగనూరు డీఎస్పీ కార్యాలయం ముందు ధర్నా చేసి డీఎస్పీకి వినతి పత్రం అందజేశారు.

వ్యక్తిగత పరిశుభ్రత అవసరం


విద్యార్థినులకు నులిపురుగు మందులను వేస్తున్న అధికారులు

గోనెగండ్ల, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): వ్యక్తిగత పరిశుభ్రత ఎంతో అవసరమని ప్రభుత్వ వైద్యురాలు రుక్సానా అన్నారు. సోమవారం గోనెగండ్ల గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు నులిపురుగు మాత్రాలు వేశారు. కార్యక్రమంలో సర్పంచ్ హైమావతి, ఎంపీహెచ్‌వో హనుమంతు, పరమేష్, బతకన్న, విజయభారతి, పరిమళకుమారి, ఏఎన్ఎం, ఆశా వర్కర్ పాల్గొన్నారు.

కళాశాలల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి


తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న విద్యార్థి సంఘం నాయకులు

ఎమ్మిగనూరు రూరల్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న కళాశాలల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ పట్టణ అధ్యక్షులు రాజు, విజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం తహసీల్దార్ శేషఫణిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రాక్టికల్స్ పేరుతో పట్టణంలోని ఆయా కళాశాలల యాజమాన్యం విద్యార్థుల నుంచి అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారన్నారు. డబ్బులు ఇస్తేనే ప్రాక్టికల్స్‌లో పాస్ చేయిస్తామని భయబ్రాంతులకు గురిచేస్తున్నారన్నారు. దీంతో విద్యార్థులు చేసేదిలేక కళాశాలల యాజమాన్యానికి డబ్బులు కట్టాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న కళాశాలల యాజమాన్యంపై చర్యలు తీసుకోకపోతే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అశోక్, సాయి, విజయ్ పాల్గొన్నారు.